Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699


అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 130 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)


గురువారం, 27 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు భూమి పూజ

**- రెండు దశల్లో రూ.260 కోట్లతో అభివృద్ధి పనులు - ఆలయ ప్రాకారం, మహా రాజగోపురం, మండపాలు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణం - మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన**















**విజయవాడ, (రాజధాని వార్తలు):** వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బుద్దా వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సజ్జల మళ్లీ నోటి దూల మొదలెట్టారని.. వైసీపీలో ఆయన శకుని, శూర్పణకలాంటి వారని సెటైర్లు గుప్పించారు. సజ్జల గురించి విజయసాయి రెడ్డి ఎప్పుడో చెప్పారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు చంద్రబాబుపై కేసులు ఉన్నట్లు సజ్జల చెప్పడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు బుద్దా వెంకన్న.

**వైసీపీకి బుద్ధి చెప్పారు..**

వైఎస్సార్ సీఎంగా ఉండగా అనేక విచారణలు చేసినా చంద్రబాబుపై ఎలాంటి తప్పులను చూపలేకపోయారని గుర్తు చేశారు. పిల్ల కాకి అయిన జగన్ మోహన్‌రెడ్డికు ఉండేల్ దెబ్బ ఏం తెలుసు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబుపై అన్యాయంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కేసులు పెట్టారని మండిపడ్డారు. ఆ సమయంలో ప్రజలే చంద్రబాబుకు అండగా నిలిచారని చెప్పుకొచ్చారు. 151 నుంచి 11 సీట్లతో ప్రజలు వైసీపీని ఓడించి బుద్ధి చెప్పారని విమ ర్శలు చేశారు. బుధవారం విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు బుద్దా వెంకన్న.

**రైతుల మీద మొసలికన్నీరు..**

'రైతుల మీద మొసలికన్నీరు కారుస్తున్న సజ్జల గత ఐదేళ్లల్లో ఏం చేశారు. గంజాయిని సాగు చేయించి కోట్లు దండుకున్నారు. జగన్ అండ్ కో పాల్ పార్టీలోకి వెళ్లేందుకు సిద్దంగా ఉన్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి రావడం కలనే. వైసీపీ నాశనం అవడానికి సజ్జల మూల కారణమని మీ నాయకులే చెబుతున్నారు. మద్యం ద్వారా పేదల ప్రాణాలు బలి చేశారు. కోట్ల రూపాయలు దోచుకున్నారు కాబట్టే కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. త్వరలోనే నీ పాత్ర బయటకు వస్తుంది.. నువ్వు జైలుకు వెళ్తావు. ర్యాలీలు, విదేశాలకు వెళ్లే జగన్.. కోర్టుకు వెళ్లమంటే అనారోగ్యం అంటారు. మొన్న కోర్టు మొట్టికాయలు వేస్తే హాజరయ్యారు. విజయసాయి రెడ్డి మీపై చేసిన విమర్శలకు సమాధానం చెప్పే దమ్ము ఉందా. నువ్వు అధికారంలోకి వస్తే చంద్రబాబు సంగతి చూస్తావా. ఏంటి నువ్వు చూసేది...నువ్వు చేసిన ఘోరాలు బయటకు వస్తున్నాయి' అని బుద్దా వెంకన్న హెచ్చరించారు.

**జగన్‌కు వ్యవసాయం తెలుసా...**

'వల్లభనేని వంశీ, జోగి రమేశ్ వెనుక నువ్వే ఉన్నావు. తప్పకుండా సూత్రధారిగా నువ్వు జైలుకు వెళ్తావు. అసలు రైతుల గురించి మాట్లాడే అర్హత మీకు ఉందా. జగన్‌కు అసలు వ్యవసాయం తెలుసా... ఫ్యాక్షనిజం మాత్రమే తెలుసు. చంద్రబాబు రైతు బిడ్డ.. అన్నదాతల కష్టాలు ఆయనకే తెలుసు. చంద్రబాబును అన్యాయంగా టచ్ చేస్తేనే మీకు దూల తీరింది. మీ పార్టీ అడ్రసును ప్రజలే గల్లంతు అయ్యేలా చేశారు. మళ్లీ చంద్రబాబును టచ్ చేసే దమ్ము, ధైర్యం ఎవరికైనా ఉన్నాయా. వైసీపీ ఖాళీ అయిపోవడం ఖాయం... ఆ పార్టీ నేతలు పాల్ పార్టీలోకి వెళ్లిపోతున్నారు. సజ్జల... నువ్వు ముందు మీ పార్టీ నాయకుల సంగతి చూసుకో. చంద్రబాబు సంగతి చూసే దమ్ము నీకు, నీ జగన్‌కు లేదు. వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటుకే పరిమితం కావడం ఖాయం. మీడియా ఉంది కదా అని నోటికొచ్చినట్లు సజ్జల రామకృష్ణారెడ్డి మా ప్రభుత్వాన్ని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతాం. వైసీపీ ప్రభుత్వంలో వెనక ఉండి అనేక దాడులు, దారుణాలు చేయించింది నువ్వే. త్వరలోనే అవన్నీ బయటకు వస్తాయి. సజ్జల జైలుకు వెళ్లడానికి సిద్దంగా ఉండాలి' అని బుద్దా వెంకన్న స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.



## సిఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సందర్శన

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిలోని సిఆర్డిఏ ప్రధాన కార్యాలయాన్ని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం సందర్శించారు. శుక్రవారం అమరావతిలో జరగనున్న బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి పర్యవేక్షించారు. కార్యక్రమ సన్నాహకాలను కమిషనర్ కె.కన్నబాబు మంత్రికి వివరించారు.


## ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రామ్‌లాల్‌జీతో మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వక భేటీ

**ఉండవల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అఖిల భారతీయ సంపర్క్ ప్రముఖ్ రామ్ లాల్ జీతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. 2006-19 వరకు రామ్‌లాల్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా (సంస్థ), ఆర్ఎస్ఎస్‌లో వివిధ ఉన్నత హోదాల్లో పనిచేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులతో ఆయన సమావేశం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులతో ఆయన భేటీ అయ్యారు. మంత్రి నారా లోకేష్ స్వయంగా వెళ్లి రామ్ లాల్‌కు స్వాగతం పలికారు. దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ చేపట్టిన కార్యక్రమాలు, సంస్థ విశిష్టతను ఈ సందర్భంగా రామ్ లాల్ వివరించారు. అనంతరం రామ్ లాల్‌ను మంగళగిరి శాలువాతో మంత్రి లోకేష్ ఘనంగా సత్కరించారు. బాలల రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించారు.



ఈ కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎన్ఎండీ ఫరూఖ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డోలా బాల వీరాంజనేయస్వామి, సత్యకుమార్ యాదవ్, ఆనం రాంనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మాక్ అసెంబ్లీ ప్రారంభం.. అన్నీ తామై నడిపిస్తున్న విద్యార్థి ప్రతినిధులు



**అమరావతి, (రాజధాని వార్తలు):** అసెంబ్లీ సమావేశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం వినూత్న ఆలోచనకు తెర తీసింది. అందుకు కోసం మాక్ అసెంబ్లీని నిర్వహించాలని నిర్ణయించింది. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాక్ అసెంబ్లీని నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం విద్యార్థుల మాక్ అసెంబ్లీ ప్రారంభమైంది. 175 నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు మాక్ అసెంబ్లీలో పాల్గొన్నారు. ఈ మాక్ అసెంబ్లీలో విద్యార్థి ప్రతినిధులు అన్నీ తామై నడిపిస్తున్నారు. ఏపీ మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అసెంబ్లీ ప్రాంగణంలో మాక్ అసెంబ్లీ జరుగుతోంది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ తదితరులు హాజరయ్యారు.

## పిల్లలకు అర్థమయ్యేలా పుస్తక రూపంలో బాలల భారత రాజ్యాంగం : లోకేష్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీ డ్రిల్ అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విద్యార్థులతో మాక్ అసెంబ్లీని మెయిన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేయాలని అకున్నామని తెలిపారు. అయితే రూల్స్ పర్మిట్ చేయవని స్పీకర్ చెప్పడంతో పాటు అసెంబ్లీ ప్రాంగణంలోనే ఈ కార్యక్రమం నిర్వహిద్దామని అన్నట్లు చెప్పారు. ఈ మాక్ అసెంబ్లీ ఏర్పాటుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్య వాదాలు తెలియజేశారు. భారత రాజ్యాంగాన్ని అడాప్ట్ చేసుకున్న రోజు ఈ రోజు అని.. అందుకే పిల్లలకు అర్థం అయ్యే రీతిలో బాలల భారత రాజ్యాంగాన్ని పుస్తక రూపంలో తెచ్చామని అన్నారు. రాజ్యాంగం భారత దేశపు ఆత్మ అని.. అందుకే మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలామ్ అజాద్ వంటి వారి గురించి ఈ పుస్తకంలో ఉంచామని వెల్లడించారు. పిల్లల సక్సెస్‌లో తల్లిదండ్రుల కృషి ఎంతో ఉంటుందన్నారు. నైతిక విలువలపై చాగంటి కోటేశ్వరరావు చెప్పినది ఎంతో మంచి మాటన్నారు. చేసిన పనిని ధైర్యంగా తల్లికి చెప్పగలిగితే అందరూ మంచి పౌరులుగా మారుతారని చాగంటి అన్నారని.. ఇదే విషయం ముఖ్యమంత్రికి కూడా తాను చెప్పినట్లు తెలిపారు. చాగంటి కోటేశ్వరరావుకు క్యాబినెట్ ర్యాంకు ఇచ్చి సలహాదారుగా నియమిస్తే.. ఒక్క రూపాయి కూడా వద్దని ప్రభుత్వ బాధ్యతను తన డబ్బులతోనే నిర్వహిస్తామని ఆయన చెప్పారని తెలిపారు. పిల్లల కోసమే ప్రతి ఒక్కరం కష్టపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తున్నామని... చాలా వరకూ సాధించామన్నారు. పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. 'క్రమశిక్షణ పట్టుదల నాలో ఉందంటే నా తల్లి భువనేశ్వరినే కారణం.. మిమ్మల్ని మీ తల్లి దండించిందో లేదో తెలియదు. నేను తప్పు చేస్తే నా తల్లి దండించింది... చిన్న తప్పు మాట్లాడితే వెంటనే మెసేజ్ చేస్తుంది' అని తెలిపారు. గాజులు తొడుక్కున్నావా, అమ్మాయిలా ఏడుస్తావా అంటూ మహిళలను కించపరిచే మాటలు ఎవ్వరూ వాడొద్దన్నారు. పుస్తకాల్లో ఉంటే చాలదని.. అమలులో ఉండాలని మంత్రి అన్నారు. 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఈ లైవ్‌ను విద్యార్థులు చూస్తున్నారని తెలిపారు. చర్చ వాస్తవాలతో జరగాలని... గొడవలతో కాదన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభించినప్పుడు రాజ్యాంగం కాపీని చేతపట్టి పాదయాత్ర చేసినట్లు తెలిపారు. తన హక్కుల గురించి పోలీసులను అడిగితే తెలియ దంటూ సమాధానం చెప్పారని.. ఎస్పీని అడగమన్నారని గుర్తు చేశారు. చిన్నతనం నుంచి రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కిరికి తెలిసేలా చేయాలని ఆనాడే నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రపం చంలో ఏ దేశానికి వెళ్ళినా రాష్ట్రాన్ని, దేశాన్ని గర్వపడేలా చేయాలని విద్యార్థులకు మంత్రి లోకేష్ సూచించారు.



## రైతుల సమస్యలు పరిష్కరిస్తాం.. పవన్ కల్యాణ్ భరోసా



**అంబేద్కర్ కోనసీమ జిల్లా, (రాజధాని వార్తలు):** గత జగన్ ప్రభుత్వంలో రైతులు ఇబ్బంది పడ్డారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసీపీ హయాంలో జరిగిన తప్పులను తమ ప్రభుత్వంలో సరిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటించారు. ఈ సందర్భంగా రైతన్నలతో సమావేశం అయ్యారు. వారి సమస్యలను విని.. పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడారు పవన్ కల్యాణ్. కోనసీమ రైతులకు గళామవుతా..గొంతువవుతానని ధైర్యం చెప్పారు. అన్నదాతల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికే తాను ఇక్కడకు వచ్చానని.. ఓట్ల కోసం కాదని స్పష్టం చేశారు. శంకర గుప్తం డ్రైన్‌తో తాగునీటి జలాలు ఉప్పుమయంగా మారాయని వివరించారు. జిల్లాలో డ్రైన్ ఆధునికీకరణకు రూ.4 వేల కోట్లు అవసరమని తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అన్నదాతల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మాటిచ్చారు. రైతులు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. డిసెంబరు రెండో వారంలో రైతన్నలతో మరోసారి సమావేశం నిర్వహి స్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

**అధికారులకు పవన్ కల్యాణ్ వార్నింగ్..**

కోనసీమ కొబ్బరి రైతుల సమస్యపై అధికారులను సున్నితంగా పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఈ క్రమంలో శంకరగుప్తం డ్రైన్ సమస్యపై తన పేషీ అధికారులు ఇచ్చిన నివేదికను చదివి వినిపించారు పవన్ కల్యాణ్. కోనసీమ కొబ్బరి రైతుల సమస్యపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. శంకర్ గుప్తం డ్రైయిన్‌కు ఉన్న ఆక్రమణలపై అధికారులు ఎందుకు దృష్టి పెట్టలేదని ప్రశ్నించారు. గతంలో ఇరిగేషన్ నిపుణుడు రోశయ్య కమిటీ ఇచ్చిన నివేదికను ఎందుకు పక్కన పెట్టేశారని నిలదీశారు. డిసెంబరు రెండో వారంలో ఇదే సమస్యపై రైతులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు సంక్రాంతి పండుగ తర్వాత కోనసీమలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన కోసం యాక్షన్ ప్లాన్ ప్రారంభించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్.

# హౌస్ కీపింగ్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ





**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ సిఆర్డిఏ ఆధ్వర్యంలో VIT-AP యూనివర్సిటీ సహకారంతో రాజధాని ప్రాంత మహిళలకు హౌస్ కీపింగ్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమం ఇటీవల ప్రారంభమైంది. అమరావతిలోని VIT ప్రాంగణంలో 15 రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

మొత్తం 109 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకోగా.. నవంబర్ 25న వారందరికీ సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, సిఆర్డిఏ సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్ వి.రాములు, ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. జగదీష్ చంద్ర ముదిగంటి, వి.రాములు మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. సిఆర్డిఏ ఆధ్వర్యంలో రానున్న రోజులలో వివిధ రంగాలలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, రాజధాని ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సిఆర్డిఏ అధికారులు కోరారు.

# మహిళాభ్యుదయానికి పునాది వేసిన రాజ్యాంగం

## - మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్




**గుంటూరు, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగం భారతీయ మహిళలకు రక్షణ కల్పిస్తూ వారి అభ్యున్నతికి పునాది వేసిందని మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. ఈనెల 26వ తేదీన గుంటూరులోని ప్రభుత్వ మహిళ కళాశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 76వ జాతీయ రాజ్యాంగ దినోత్సవ సభకు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.ఆర్.జోత్స్న కుమారి అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ 1951 లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలు, దళితులు, గిరిజనులు, వికలాంగులు, బలహీన వర్గాల వారికి రక్షణ కల్పించడం ద్వారా కోట్లాదిమంది నిస్సహాయులకు ఆదరణ లభించిందన్నారు. దేశ భక్తి అంటే ముస్లింలను ముస్లిం దేశాలను విమర్శించడం కాదని, దేశంలో ఉన్న భారతీయులందరినీ కుల, మత, లింగ భేదాలకు అతీతంగా సమదృష్టితో చూస్తూ వారి అభివృద్ధి కోసం కృషి చేయడమేనని మన రాజ్యాంగం స్పష్ట పరిచిందని వివరిం చారు. రాజ్యాంగం అమలై 75 సంవత్సరాలు పూర్తయిన ఇంకా నిరక్షరాస్యత, నిరోద్యోగిత, అసమానతలు లాంటి సమస్యలతో దాదాపు 24 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధికి కొలమానంగా మహిళా అభివృద్ధిని చూడాలన్నారు. నేటికీ బాలికలు పౌష్టికాహారం పొందలేక రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొంటూ తల్లిదండ్రులు 8 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ భారత రాజ్యాంగం సజీవ పత్రం అని, భారత సమాజంలో మార్పులకు అనుగుణంగా 105 సార్లు రాజ్యాంగ సవరణలు జరిగి సుమున్నాతంగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగం పీఠికలో పేర్కొన్న సామ్యవాద, లౌకిక, సమగ్రతలను కాపాడుకోవడానికి కృషి జరగాలన్నారు. 75 సంవత్సరాల భారత రాజ్యాంగం అమలు తర్వాత భారతదేశం జనాభాలో ప్రపంచంలో మొదటి స్థానానికి చేరుకున్నామని, మిగిలిన అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నామని వివరించారు. భారత్ తోపాటు స్వాతంత్ర్యం పొందిన చైనా తలసరి ఆదాయం మనకన్నా 6 రెట్లు అధికంగా ఉందన్నారు. భారతదేశం సగర్వంగా ప్రపంచంలో అత్యున్నత స్థితికి చేరుకోవాలంటే అసమానతలు, పేదరికం, మూఢనమ్మకాలు తగ్గాలని కోరారు. 2029 ఎన్నికల్లో మహిళలకు చట్టసభలలో 33 శాతం సీట్లు కేటాయించే విధంగా చేసిన రాజ్యాంగ సవరణ అమల్లోకి వస్తుందని, వేలాది మంది మహిళలు చట్టసభలల్లో సభ్యులు కావడం హర్షణీయమన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కె.సతీష్ రాజ్యాంగ పీఠికను విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. 76వ జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన,వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు బి. లలిత బాబు, బి. క్యూరీ, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, మానవత సభ్యులు బాలకృష్ణ చౌదరి, చావా శివాజీ, చావా లక్ష్మి సామ్రాజ్యం, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, మహిళా కళాశాల సిబ్బంది దాదాపు 300 మంది విద్యార్థినిలు పాల్గొని ప్రసంగించారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించండి - పత్రికావిలువలను కాపాడండి

## - రాజ్యాంగ దినోత్సవ వేడుకల సందర్భంగా సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ పిలుపు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** "రాజ్యాంగ స్ఫూర్తి"తో పాత్రికేయులు తమ వృత్తిని కొనసాగించాలని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ కోరారు. రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగం 19 (1-ఎ) అధికరణంలో భావ ప్రకటన స్వేచ్ఛ రూపంలో అందించిన "పత్రికా స్వేచ్ఛ"ను నిజమైన స్ఫూర్తితో కొనసాగించాలని ఆయన పిలుపు నిచ్చారు. అదే సందర్భంలో ఆర్టికల్ 19 (2) లో పేర్కొన్న మినహాయింపుల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. న్యాయవ్యవస్థ తీర్పులకు సంబంధించి అంశాలపై వార్తలు రాసేటప్పుడు న్యాయ వ్యవస్థ ప్రతిష్టకు భంగం కలగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. జర్నలిజం ప్రమాణాలు పెంపొందించే దిశగా సి.ఆర్. మీడియా అకాడమీ తన వంతు ప్రయత్నం చేస్తోందని తెలిపారు. ఇందుకోసం విలేఖరులకు పునశ్చరణ తరగతులు నివహిస్తోన్న సంగతిని ఆయన గుర్తు చేశారు. గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు గుంటూరు,ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాలలో విలేఖరులకు పునశ్చరణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం స్థానిక సి.ఆర్. మీడియా అకాడమీ కార్యాలయంలో "రాజ్యాంగ పీఠిక"ను సిబ్బంది అధికారులచే వల్లె వేయించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్. మీడియా అకాడమీ అధికారులు ఎం.భాస్కర నారాయణ, శాంతారాం, లోవరాజు, జాలిరెడ్డి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు భూమిపూజ

## - రెండు దశల్లో రూ.260 కోట్లతో అభివృద్ధి పనులు - ఆలయ ప్రాకారం, మహా రాజగోపురం, మండపాలు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణం - మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ తదితర నిర్మాణాలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి రాజధాని వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు శంకుస్థాపన చేయనున్నారు. రూ.260 కోట్లతో రెండు దశల్లో చేపట్టనున్న పనులకు సీఎం చేతుల మీదుగా భూమిపూజ జరుగనుంది. మొదటి దశలో రూ.140 కోట్లు వ్యయంతో వివిధ పనుల్ని చేపట్టనున్నారు. రూ. 92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం నిర్మించనున్నారు. ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు. వీటి నిర్మాణాలకు రూ.48 కోట్లు ఖర్చు కానుంది. ఇక రెండోదశ పనులను రూ.120 కోట్లతో చేపట్టనున్నారు. శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు-సిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనులను చేపట్టనున్నారు. ఇప్పటికే ఆలయ నిర్మాణం మొదటి విడత పూర్తైన నేపథ్యంలో రేపు శంకుస్థాపన అనంతరం రెండు, మూడవ విడత పనులు చేపట్టనున్నారు. 4వ విడత పనుల్ని కూడా త్వరలోనే చేపట్టి టెండర్లు పిలుస్తారు.

**ఆలయ విస్తరణకు గత ప్రభుత్వంలో గ్రహణం**

తిరుమల తరహాలో రాజధాని అమరావతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణా నది తీరాన అత్యద్భుతంగా వేంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి 25.417 ఎకరాలు కేటాయించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక గత పాలకులు ఆలయ విస్తీర్ణాన్ని కుదించారు. కేటాయించిన భూమిలోనూ కోత పెట్టడంతో పాటు విస్తరణ పనులు రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ అమరావతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామికి దేవాలయం విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది.

# ఉచిత కంటి పొర శిబిరాన్ని విజయవంతం చెయ్యండి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ భీమేశ్వర ఆలయం వద్ద ఈనెల 27 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు ఉచిత కంటిపొర చికిత్స శిభిరం జరగుతుండగా దానిని విజయవంతం చెయ్యాలని నిర్వాహకులు గడ్డమనుగు శివ, కందూరి శ్యామ్, మీసాల సునీత, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీశ్ మోహన్‌లు తెలిపారు. మంగళవారం భీమేశ్వర స్వామి ఆలయ సమీపాన గల టూరిజం భవనంలో ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకులు, ఆలయ కమిటీ నాయకులు మాట్లాడుతూ శ్రీ శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యంజలి (అమెరికా) ల సహకారంతో భీమేశ్వర ఆలయం ఆధ్వర్యంలో ఈ శిభిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 27 నుంచి మార్చి 3వ తేదీ వరకు 7 రోజులు పాటు కంటి పొర (శుక్లం) ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్‌లు అవసరమైన వారికి డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు సుమారు రూ. 5 కోట్ల విలువ గల అత్యాధునికమైన బస్సులలో కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిభిరాన్ని సామర్లకోట పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్ రావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గోల్తి సత్య నారాయణ, కంచర్ల సుష్మా మోహిని, నాయకులు అందుగుల జార్జి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కుటుంబాలకు అండగా నవ జీవన్ సంస్థ

## - గిరిజనుల సేవలో తరిస్తున్న నవ జీవన్ సంస్థ
## - నేడు నెల్లూరులో 200 కుటుంబాలకు వస్తువుల పంపిణీ
## - సంస్థ సేవలను అభినందించిన ఐటిడిఏ అధికారులు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాతో పాటూ దేశంలోని మరో 5 రాష్ట్రాల్లో గిరిజనుల సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్న నవ జీవన్ సంస్థ మరో బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. మొంథా తుఫానుతో నెల్లూరు సిటీలో ఇబ్బంది పడ్డ 2వేల గిరిజన కుటుంబాలకు అండగా నిలిచింది. నవ జీవన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె. సహదేవయ్య మంగళవారం నెల్లూరులోని 200 గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికీ 2 వేలు విలువజేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మంగళవారం నగరంలోని ఐటిడిఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లిఖార్జున్, నవజ్యోతి సంస్థ డైరెక్టర్ విక్టోరియా, ప్రాజెక్టు కో - ఆర్డినేటర్లు విజయ భాస్కర్, శ్రీనివాసులు, పెంచలయ్య, యానాది మహానాడు అధ్యక్షులు ఇండ్ల రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లావణ్య, ప్రాజెక్టు కో - ఆర్డినేటర్ ప్రభావతి పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా 200 గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికీ 2 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవ జీవన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సహదేవయ్య మాట్లాడుతూ నెల్లూరులో మొంథా తుఫానుతో ఇబ్బంది పడ్డ గిరిజన కుటుం బాలకు బాసటగా తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నెల్లూరులోనే కాకుండా దేశంలోని 5 రాష్ట్రాల్లో తమ సంస్థ గిరిజనుల సంక్షేమం కోసం పనిచేస్తుందని వెల్లడించారు. చెత్త ఏరుకుని జీవించే గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచేందుకు తాము రెండు వేల మందికి చెక్కబండ్లు అందజేశామన్నారు. అలాగే నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు కూడా పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేని స్థితిలో ఉన్న అనేక మంది గిరిజనులకు తమ సంస్థ ద్వారా ఆధార్ కార్డులు ఇప్పించి పథకాలను అందజేశామన్నారు. అంతే కాకుండా సునామీ సంభవించిన సమయంలో అనేక మంది గిరిజనులకు ఇళ్లు కట్టించామని పేర్కొన్నారు.

# రాష్ట్ర భవిష్యత్తు కోసం కోటి సంతకాల స్వీకరణ : మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి




**కొడవలూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర భవిష్యత్తు కోసం వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, వీరి చలపతి ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని మానేగుంటపాడు గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకు మార్రెడ్డి, వీరి చలపతిరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాల గురించి ధ్వజమెత్తారు, వైకాపా ప్రభుత్వంలో పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను నెలకొల్పటం జరిగిందని, తెలుగుదేశం ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల యొక్క ఎదుగుదలను, మనుగడను దెబ్బతీయడం జరుగుతుందని, తెలుగుదేశం పార్టీ తమ సొంత ప్రయోజనాల కోసమే టెండర్ల వేయడం జరుగుతుందని, పేద విద్యార్థులకు అన్యాయం జరిగితే ఊరుకునే సమస్య లేదని, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని అందువల్లనే రాష్ట్రంలో కోటి సంతకాల స్వీకరణ జరుగు తుందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసే పరిస్థితులలో ఈ ప్రభుత్వం ఉందని ప్రజలందరూ తెలుసుకోవాలని, ఈ కోటి సంతకాల స్వీకరణ అనంతరం ఈ సంతకాల పత్రాలను గవర్నర్‌కు సమర్పించి, ప్రభుత్వాన్ని అభివృద్ధి పరిచే విధంగా మంచి కార్యక్ర మాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో భాగంగా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, గ్రామ సర్పంచ్ మోచర్ల రమేష్, మండల కన్వీనర్ శేషగిరి, కామేశ్వరి, కవరగిరి ప్రసాద్, పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా కమ్మపల్లి గ్రామంలో చెత్తబుట్టల పంపిణీ

**డక్కిలి, (రాజధాని వార్తలు):** స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా, కమ్మపల్లి గ్రామం నందు చెత్త బుట్టలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పోకూరు రమేష్ నాయుడు ప్రతి ఇంటికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పి.పి.చౌదరి, నర్రవుల గోపాల్ నాయుడు సంక్రాంతి, రవి నాయుడు, జడపల్లి వెంకట రమణ, రామయ్య నాయుడు, తెలుగుయువత, పోకూరు అజయ్ కూమార్, సంక్రాంతి సునీల్ కూమార్, కళ్యాణ్, దాసరి హరి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రమేష్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేసి సంక్షేమం కోసం కృషి చేస్తుందని, అలానే 1300, కాలనీ ఇళ్ళు మంజూరు చెయ్యడం జరిగింది. అలాగే సిసి రోడ్లు, ఇలా చాలా వేగంగా



పనిచేస్తూ ప్రజల మనగడు కోసం పని చేసే ప్రభుత్వమే కుటామీ ప్రభుత్వం అని తెలియజేశారు.

# నెల్లూరు జిల్లా రైతులకు వరంగా మారిన జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్

**- ఉద్యానవన పంటలతో సన్న చిన్నకారు రైతులకు లాభదాయకం**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ పద్ధతి నెల్లూరు జిల్లాలో రైతులకు వరంగా మారింది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ఈ పద్ధతిలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు వంటి హార్టికల్చర్ పంటలను సాగుచేయడంపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. సాంప్రదాయంగా వరి పంటకు పేరుగాంచిన నెల్లూరు జిల్లా ఇప్పుడు హార్టికల్చర్ కేంద్రంగా మారుతున్నది. జిల్లాలోని మొత్తం 5 లక్షల ఎకరాల ఆయకట్టు భూమిలో ఒక లక్ష ఎకరాల్లో సుమారు 25,000 మంది రైతులు, ఇందులో ఎక్కువగా మహిళలు జడ్‌బిఎన్ఎఫ్ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారు. 2017లో జిల్లాలో రైతులు విస్తృతంగా జడ్‌బిఎన్ఎఫ్ పద్ధతిని ఆచరించడం ప్రారంభించారు. అప్పుడు 12 వ్యవసాయ ఉపవిభాగాలకు చెందిన 270 క్లస్టర్లలో, 700 గ్రామాల్లో సుమారు లక్ష ఎకరాల్లో ఈ పద్ధతిని విజయవంతంగా అమలు చేశారు. ఇందుకూరుపేటకు చెందిన మహిళా రైతు కె.పెంచలమ్మ 2017లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జడ్‌బిఎన్ఎఫ్ సదస్సులో అవార్డు పొందారు. ఆమె మాట్లాడుతూ "2017 నుంచి నేను మూడు ఎకరాల్లో అరటి తోటలు, ఆకుకూరలను జడ్‌బిఎన్ఎఫ్ విధానంలో పండిస్తున్నాను. ఈ పద్ధతిలో రసాయన ఎరువులు, పురుగుమందులు అవసరం ఉండదు. ఎందుకంటే ఇది పూర్తిగా సేంద్రీయ వ్యవసాయం. నేను పశువుల పేడ, మూత్రాన్ని మాత్రమే ఉపయోగిస్తాను. తక్కువ ఖర్చుతో, తక్కువ నీటి వినియోగంతో మంచి దిగుబడులు వస్తాయి" అని తెలిపారు. జిల్లా నేచురల్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ జడ్‌బిఎన్ఎఫ్ పద్ధతిలో రసాయన ఎరువులు, పురుగుమందులకు బదులుగా పశువుల పేడ, మూత్రం, బెల్లం, పప్పుపిండి వంటివి ఉపయోగించడం వల్ల నేల ధర్మం మెరుగుపడి పంట పెరుగుదలకు అనుకూలంగా మారుతుందని చెప్పారు. "దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ పద్ధతిని చాలా ఏ



ళ్లుగా అమలు చేస్తూ ఉన్నాయి. ఇది శాస్త్రీయంగా కూడా నిరూపితమైంది" అని తెలిపారు. జడ్‌బిఎన్ఎఫ్ పద్ధతితో సాధారణ సాగుతో పోలిస్తే 50 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని, ముఖ్యంగా వేరుశెనగ పంట సాగుచేసే రైతులు సుమారు 23 శాతం ఖర్చును ఆదా చేసుకోవచ్చు అని ఆయన వివరించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో, తక్కువ నిర్వహణతో అధిక నాణ్యత గల దిగుబడులు తీసుకోవడానికి రైతులు జడ్‌బిఎన్ఎఫ్ పద్ధతిని విస్తృతంగా అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న ఒక లక్ష ఎకరాల జడ్‌బిఎన్ఎఫ్ సాగును భవిష్యత్తులో రెట్టింపు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది, ఈ పద్ధతికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు.

# మనసున్న మారాజు ఎంపీ విపిఆర్ సిద్దు సుబ్బారెడ్డి

**- కంటి నేత్ర కార్యక్రమం ద్వారా పేదలకు కంటి చూపు అందిస్తున్న ఎంపీ వి.పి.ఆర్**

**- "వి పి ఆర్ ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు"**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు వరిగొండపాడు మండలం ఇరువురు గ్రామం నందు కంటి నేత్ర అనే కార్యక్రమం ప్రముఖ వ్యాపారవేత్త తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు సిద్దు సుబ్బారెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కంటి నేత్ర కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించి అవ్వ తాతలకు వైద్యులకు చూపించి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనసున్న మారాజు మా జిల్లా ఎంపీ విపిఆర్ పేద ప్రజలకు విపిఆర్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పేదవాడికి కంటి చూపు అందించాలన్న గొప్ప సంకల్పంతో కంటి నేత్ర అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఈరోజు మా గ్రామంలో ఈ కార్యక్రమం విజయవంతంగా చేపట్టడం జరిగిందని పేద ప్రజలకు కంటి చూపు అందిస్తున్న ఎంపీ విపిఆర్‌కి ఇరువురి గ్రామ ప్రజలందరూ నుండి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నారని ఈ సందర్భంగా సిద్దు సుబ్బారెడ్డి తెలియజేశారు. అలాగే ఈ ఊరిలో వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ వారు చదివిన పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్సి రమణారెడ్డి గారు సిద్దు వెంకటరమణారెడ్డి గ్రామ సర్పంచ్ పాలకొల్లు భాస్కర్ రెడ్డి



స్కూల్ ప్రధానోపాధ్యాయులు టీచర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లే అవుట్ స్థలాలను పరిశీలించిన కమిషనర్ వై ఓ నందన్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ నగర పర్యటనలో భాగంగా స్థానిక రెడ్ క్రాస్ సమీపంలోని లేఔట్ స్థలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు అతిక్రమించిన అన్ని భవనాలు బి.పి.ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనధికార లేఔట్లలోని ప్లాట్ల యజమానులు తప్పనిసరిగా ఎల్.ఆర్.ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే పుష్ప యాగానికి పువ్వుల సేకరణ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే పుష్ప యాగానికి విశాఖ నగరం నుంచి పువ్వులు పంపుతున్నట్లు టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరాం తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఎంవిపి కాలని టీటీడీ కళ్యాణ మండపంలో తన సతీమణి పద్మజ తో కలసి ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పెద్ద మొత్తంలో పువ్వులు పంపేందుకు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో హిమాంశు ప్రసాద్, స్వామి సేవకులు లక్ష్మీ ప్రశన్న, రామలక్ష్మి, శశి కళ, హేమలత, రాజు, సత్య కుమార్, నెక్కంటి సత్తిబాబు, ఈశ్వరరావు, పూసపాటి రాజు



తదితరులు పాల్గొన్నారు.

# రూ.400 కోట్ల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

**- జీవీఎంసీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు డిమాండ్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గత 13 నెలలుగా జీవీఎంసీ కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.400 కోట్ల బిల్లులను తక్షణమే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.వి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం జీపీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫీసులో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కోట్ల బిల్లుల విడుదల కోసం కాంట్రాక్టర్లు డిసెంబర్ 1 నుండి సమ్మె చేయడానికి నిర్ణయించామని తెలిపారు. జీవీఎంసీలోని కాంట్రాక్టర్ల సమస్యలు తీరనందున వాటిపై ఉద్యమించనున్న మన్నారు. అలాగే గత ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గ్రాంట్ ఈఎండిపై పోరాటం ఉధృతం చేయనున్నామని తెలిపారు. గత ఆరు ఏళ్లుగా ఎస్డిఎఫ్ జిజిఎంపి పెండింగ్ బిల్లును చెల్లించాలన్నారు. పద్ధతి ప్రకారం కాంట్రాక్ట్ పేమెంట్లు జరిపించి, అడ్డదారిలో బిల్లులు ఇచ్చే విధానం పూర్తిగా నిలిపియాలని కోరారు. బడ్జెట్ ఉన్న పనులకు మాత్రమే జీవీఎంసీ టెండర్లు పిలవాలన్నారు. పైన పేర్కొన్న అంశాలపై జీవీఎంసీకి నోటీసు ఇచ్చి డిసెంబర్ 1 నుండి పనులను నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, గౌరవ అధ్యక్షులు వీరారెడ్డి, అధ్యక్షులు సింహాచలం, కార్యదర్శి రమేష్, కోశాధికారి శ్రీనివాసరావుతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

# విశాఖ 41వ వార్డు కార్పొరేటర్ కార్యాలయం వద్ద మహిళల వృత్తి నైపుణ్యం శిక్షణ

**- నేషనల్ సర్వీస్ స్కీమ్ ప్రతినిధులు - కార్పొరేటర్ పూర్ణిమ కార్యాలయం వద్ద నిర్వహించిన మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం - తరలి వచ్చిన వార్డు ప్రజలు**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ 41వ వార్డు మహిళలకు వృత్తి నైపుణ్యం పెంపొందించేలా వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కార్పొరేటర్ పూర్ణిమ కార్యాలయం వద్ద నేషనల్ సర్వీస్ స్కీమ్ ప్రతినిదులు నిర్వహించారు. కుటీర పరిశ్రమలను ప్రోత్సహించేలా వారిలో వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేలా ఫినాయిల్, సరఫ్ స్వయంగా తయారు చేసే విదానంపై శిక్షణ ఇచ్చారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు వైసీపీ అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్ సహకారంతో నేషనల్ సర్వీస్ స్కీమ్ ప్రతినిదులు, మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీగా వార్డు ప్రజలు తరలి వచ్చి ఫినాయిల్, సరఫ్ వంటి వాటిని తయారు చేసే విదానంపై అవగాహన పెంచుకున్నారు.




ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు ప్రసంశించారు.

# విజయశ్రీ బ్లడ్ సెంటర్ సీజ్

**- తదుపరి ఆదేశాల వరకు కార్యకలాపాలు నిలిపివేత**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నగరంలోని మహారాణి పేట బుధవారపు గార్డెన్స్‌లో విజయశ్రీ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎం/ఎస్ విజయశ్రీ బ్లడ్ సెంటర్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసి బ్లడ్ బ్యాంక్‌ను తాము సీజ్ చేసినట్టు డ్రగ్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు తెలిపారు. ఇటీవల ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు తాము జరిపిన ఆకస్మిక తనిఖీలలో ఇక్కడ తీవ్రమైన నాణ్యతా ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయన్నారు. అర్హత లేని సిబ్బందితో పని చేయిస్తూ, సరైన వైద్య అధికారుల పర్యవేక్షణ లేకుండా రక్త సేకరణ చేస్తున్నారని, సరైన నాణ్యత ప్రమాణాలు కూడా పాటించడం లేదని తాము గమనించామన్నారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ మరియు లైసెన్సింగ్ అథారిటీ ఎం.పాండురంగ ప్రసాద్ ఆదేశాల మేరకు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా బ్లడ్ సెంటర్ యొక్క అన్ని కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసున్నామన్నారు. రక్త సేకరణలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే రక్త మార్పిడి సమయంలో రియాక్షన్స్ వచ్చి ప్రాణాంతకం కావొచ్చున్నారు. అర్హత కలిగిన వైద్య అధికారులు మరియు సిబ్బంది సమక్షంలో మాత్రమే బ్లడ్ బ్యాంక్ కార్యకలాపాలు మరియు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఉల్లంఘించే లైసెన్సుదారులపై ఈ విధంగానే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

rajadhanivartalu.com

గురువారం, 27 - 11 - 2025

# సంపాదకీయం

## భారతి ఆరాధకులు కానరారే

'నేను ఎవరి కోసం తీయని రాగాల్ని పాడాలి?.. మన కనుల ముందే దేశం ఆకలితో కుమిలిపోతున్నప్పుడు. దేశమంతా విషాన్ని మథిస్తుంటే, ఢిల్లీ మద్యం సేవిస్తోంది. దేశమంతా చీకటి నిండితే ఢిల్లీ మెరిసిపోతోంది..' అని హిందీ కవి రాంధారీ సింగ్ దినకర్ (1908-74) ఆక్రోశించారు. ఆయన బిహారీ. కాంగ్రెస్‌వాది. జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా దినకర్‌ను మూడుసార్లు రాజ్యసభకు ఎంపిక చేశారు. రాజ్యసభ సభ్యుడుగా ఉన్నప్పుడే ఆయన ఈ కవిత రాశారు. దినకర్ కవితలు ప్రజల వెతలను ప్రభావవంతంగా వ్యక్తం చేశాయి. కనుకనే వాటిని జయప్రకాశ్ నారాయణ్ మాత్రమే కాదు, అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ సైతం అమితంగా అభిమానించారు. ఈ బిహారీ కవి కవితల్ని వాజపేయి అనేక సందర్భాల్లో ఉటంకించేవారు. మోదీ సైతం తరచూ ఉటంకిస్తూ దినకర్ పట్ల తన అభిమానాన్ని చాటుతుంటారు. కాంగ్రెస్‌వాది అయిన ఈ కవి తల్లజుని శతజయంత్యుత్సవాలను భారతీయ జనతా పార్టీ ఘనంగా నిర్వహించింది. అధికార పీఠాలు గుర్తించినా, గుర్తించకపోయినా కవులు, రచయితలు తమ మనసు కలచివేసిన వాస్తవాల గురించి రచిస్తూనే ఉంటారు. చాలామంది జర్నలిస్టులు రాయలేని నిజాలు కవులు, రచయితల రచనల్లో తచ్చాడుతుంటాయని అంగీకరించక తప్పదు. బిహార్‌లో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో గతంతో పోలిస్తే నేరచరితులు 68 నుంచి 53 శాతానికి తగ్గిపోవడం ఒక శుభపరిణామం. గతంలో బిహార్‌లో సాహితీవేత్తలు, రచయితలు, కవులు క్రియాశీలంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేవారు. తర్వాతి కాలంలో వారి స్థానంలో నేర చరితులు ప్రవేశించారు. రామకృష్ణ బేణిపురి, లక్ష్మీనారాయణ సుధాంశు, ఫణీశ్వర్‌నాథ్ రేణు వంటి రచయితలు 1950వ దశకంలో ఎన్నికల బరిలో నిలిచి పోరాడారు. బేణిపురి, సుధాంశు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుపాలయ్యారు. ఆ స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు కూడా. దళితుల హక్కుల పరిరక్షణ, రైతుల ప్రయోజనాల కోసం పోరాడిన ఫణీశ్వర్‌నాథ్ రేణు (1921-77) అరారియా జిల్లాలోని ఫోర్బ్స్ గంజ్ నియోజకవర్గం నుంచి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. కబీర్ గీతాల్ని, రామాయణ శ్లోకాల్ని, అమీర్ ఖుస్రో పర్షియన్ కవితల్ని ఉటంకిస్తూ ఆయన ప్రచారం చేశారు. ఎందరో రచయితలు, కళాకారులు ప్రచారం చేసినా ఆయన కేవలం 5వేల ఓట్లు మాత్రమే తెచ్చుకున్నారు. 'తీస్రీ కసమ్' లాంటి కళాత్మక సినిమాలకు ప్రేరణనిచ్చిన రేణు ఎన్నికల ఓటమి తర్వాత 'కాగజ్ కీ నావ్' (కాగితపు పడవ) అనే నవల రచించారు. అప్పటికి దేశంలో ఎన్నికల వాతావరణం సంపన్నులకు, నేర చరితులకు అనుకూలంగా మారిపోయింది. ఆ తర్వాతి కాలంలో దేశంలో రచయితలు, కళాకారులకూ- రాజకీయ వ్యవస్థకూ దూరం రోజురోజుకూ పెరిగిపోయింది. రేణు సృజించిన సాహిత్యంలోని స్ఫూర్తిదాయక మాటలను మోదీ, నితీశ్‌కుమార్ మొదలైన నేతలు తరచూ ఉటంకిస్తూ ఉంటారు. బిహార్‌లోని మధుబని ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల గాయని మైథిలీ థాకూర్- మైథిలీ, భోజ్‌పురి, హిందీ భాషల్లో స్వంత గీతాలతో పాటు భక్తి గీతాలూ ఆలపిస్తుంటారు. గాయనిగా సామాజిక మాధ్యమాలలో ఆమె బహుళ ప్రచారం పొందారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో అలీనగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఆమె విజయం.. ఉక్కబోస్తున్న వాతావరణంలో ఒక మలయానిలం వీయడం లాంటిదే. మైథిలిని తమ అభ్యర్థిగా బీజేపీ నిలబెట్టడం ఆ పార్టీ ఆలోచనా విధానానికి యుక్తమైన నిర్ణయమే. అయితే దేశంలో తమ పార్టీ భావజాలంతో సంబంధం లేకపోయినా ప్రముఖ రచయితలను, కళాకారులను చట్టసభలకు, ముఖ్యంగా పార్లమెంటు ఎగువసభ అయిన రాజ్యసభకు ఎంపిక చేయడమనే ఒక మంచి సంప్రదాయాన్ని జాతీయ స్థాయిలో కొనసాగించిన నేతలు ఉన్నారు. నెహ్రూ నుంచి వాజపేయి దాకా ఈ సంప్రదాయాన్ని పాటించారు. నెహ్రూ తరచూ రచయితలను తీన్‌మూర్తి భవన్‌కు పిలిచి మాట్లాడడమే కాక గేటు వరకూ వచ్చి వారికి వీడ్కోలు చెప్పేవారు. మైథిలీ శరణ్ గుప్తా, కెఎం.పణిక్కర్, తారాశంకర్ బందోపాధ్యాయ, హరివంశరాయ్ బచ్చన్, జి.శంకర్ కురూప్, ఉమాశంకర్ జోషి, అబూ అబ్రహం, హబీబ్ తన్వర్, భగవతి చరణ్ వర్మ, కుష్వంత్ సింగ్, అమృతా ప్రీతమ్, ఆర్‌కె.నారాయణ్, కర్తార్‌సింగ్ దుగ్గల్, సి.నారాయణరెడ్డి, విద్యానివాస్ మిశ్రా, జావేద్ అఖ్తర్ తదితరులు రాజ్యసభకు నామినేట్ అయిన వారే. సినారెను రాజ్యసభకు నామినేట్ చేసిన సాహిత్య సహృదయుడు వాజపేయి. సినారెను చూడగానే వాజపేయి కవిత్వ పిపాసి అయిపోయేవారు. ఇరువురూ పార్లమెంటు నడవాల్లో ఉర్దూ కవితలను గుర్తు చేసుకుంటూ నడిచేవారు. తర్వాతి కాలంలో పెద్దల సభకు కవులు, రచయితలను ఎంపికచేయడం క్రమంగా తగ్గిపోయింది. ఒకవేళ ఒకరిద్దరిని ఎంపిక చేసినా నాటి ప్రమాణాలు వారిలో కనపడడం తక్కువే. ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు? నిజానికి యూరోపియన్ ప్రమాణాలతో పోలిస్తే మన దేశంలో రచయితలను, కళాకారులను గౌరవించిన సందర్భాలు చాలా తక్కువే. ఇటీవల ఐర్లాండ్‌ను సందర్శించినప్పుడు అక్కడ రహదారుల కూడళ్లలోనూ, మార్కెట్ ప్రాంతాల్లోనూ, పార్కుల్లోనూ ఎక్కడ చూసినా రచయితల, కళాకారుల విగ్రహాలే కనపడ్డాయి. డబ్లిన్ నడిబొడ్డున మ్యూజియమ్ ఆఫ్ లిటరేచర్‌లో ఐరిష్ రచయితలు, వారి రచనలను ప్రదర్శించిన తీరు ఎవరికైనా అచ్చెరువు కలిగిస్తుంది. విఖ్యాత నవలా రచయిత జేమ్స్ జాయిస్ (1882-1941) రచనలు మనను చుట్టుముడతాయి. మహాకవి విలియం బట్లర్ యేట్స్ (1865-1939) పేరిట నిర్మించిన మ్యూజియంలో ఆయనకు సంబంధించిన వస్తువులు, రచనలు, పుస్తకాలను ప్రదర్శించడమే కాక, అడుగడుగునా ఆయన కవితల మధ్య మనం నడుస్తున్నట్లు వాతావరణాన్ని, దృశ్యాల్ని కల్పించారు.

# 7న ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ వన సమారాధన

**- మధురవాడ జాతరలో నిర్వహణ - ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు - మహిళలకు చీరలు పంపిణీ పిల్లలకు ప్రత్యేక బహుమతులు - కనువిందు చేయనున్న సాంస్కృతిక కార్యక్రమాలు - జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల**



**విశాఖ, అక్కయ్యపాలెం జంక్షన్, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో డిసెంబర్ 7న వర్కింగ్ జర్నలిస్టుల వన సమారాధన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి. నారాయణలు తెలిపారు. మంగళవారం ఇక్కడ అక్కయ్యపాలెం జంక్షన్‌లోని ఒక ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన యూనియన్‌ల కార్యవర్గ సమావేశంలో వన సమారాధనతో పాటు పలు అంశాలపై సభ్యులంతా చర్చించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు, నారాయణలు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల కోసం వన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మధురవాడ జాతరలో 7న ఉదయం 9 గంటల నుంచి అల్పాహారం ప్రారంభమవుతుందన్నారు. ఆ తర్వాత కనువిందు చేయనున్న సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులు ప్రసంగాలు మహిళలకు చీరలు పంపిణీ పిల్లలకు బహుమతులు ఇలా అనే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం విందు భోజనం ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ప్రత్యేకంగా బస్సు సదుపాయం కల్పించామన్నారు. కావున ఈ వన సమారాధనలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని వీరు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ వంతు పాటు పడుతూనే మరోవైపు ఉగాది దసరా దీపావళి వంటి పండుగలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ.సాంబశివరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇ.ఈశ్వరరావు కార్యదర్శి మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ ఆయా యూనియన్లో కార్యవర్గ ప్రతినిధులు ప్రసాద్, కిషోర్, కామన్న కె.వి శర్మ కృష్ణమూర్తినాయుడు, పక్కి వేణు గోపాల్, పిల్లా నగేష్ బాబు, రాజశేఖర్, కామన్న పి.నాగేశ్వరరావు తదితరులంతా పాల్గొన్నారు.

# దక్షిణలో "వాసుపల్లి" సేవలకు ప్రజల్లో తగ్గని బ్రాండ్ ఇమేజ్

**- గురజాపు రవి ఆధ్వర్యంలో వైసీపీలో యువత చేరికలు**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అధికారంలో ఉన్న లేకపోయినా వాసుపల్లి గణేష్ కుమార్ అందిస్తున్న నిరంతర సేవా కార్యక్రమాలు ప్రజల్లో ఆయనకున్న బ్రాండ్ ఇమేజ్ తగ్గదని 38వ వార్డు అధ్యక్షుడు గురజాపు రవి అన్నారు. ఆసీలమెట్ట కార్యాలయంలో మంగళవారం 38వ వార్డు నుండి పలువురు యువకులు గురజాపు రవి, చాపల నూకరాజు (బుడ్డి) ఆధ్వర్యంలో వైయస్సార్సీపీలో చేరారు. వారినీ పార్టీలోకి ఆహ్వానిస్తూ వాసుపల్లి గణేష్ కుమార్ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ మంచి ప్రభుత్వానికి ప్రజల తోడు ఎప్పుడూ ఉంటుందన్నారు. వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమం అభివృద్ధి పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ రెట్టింపు పథకాలు నవరత్నాలు పేరుతో ఆశ ఎరవేసిన కూటమి ప్రభుత్వంను గెలిపించుకొని ఇప్పుడు ప్రజలు మోసపోయి బాధపడుతున్నారన్నారు. చేసిన పొరపాటును సరిదిద్దుకునేందుకు యువత, ప్రజలు వారి ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యల కానీ అభివృద్ధి కానీ పట్టించుకునే నాయకుడే లేరన్నారు. సర్వ మతాలకు పాత పట్టణం నిలయమని, అందరూ కలిసిమెలిసి ఉండే ఈ నియోజకవర్గంలో మత్స్యకారులు, ముస్లిం సోదరులు, క్రైస్తవులు అత్యధికంగా ఉన్నారన్నారు. వారికోసం ఎప్పుడు అండగా ఉంటానని వాసుపల్లి తెలిపారు. గురజాపు రవి మాట్లాడుతూ వాసుపల్లి నాయకత్వాన్ని దూరం చేసుకున్నా ప్రజలు మళ్లీ ఆయనను కోరుకుంటున్నారని తెలిపారు. దక్షణ నియోజకవర్గంలో వాసుపల్లి సేవలు అవసరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోర్ రిపేర్లు చేయిస్తున్న అంగటి శ్రావణ్ కుమార్, మన్యాల శ్రీనివాస్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 29వ వార్డు వేంకటేశ్వర నగర్ ఏరియాలో పర్యటించిన 29వ వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్ మరియు జనసేన సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్ స్థానికుల తెలిపిన వినతుల మేరకు బోర్ పని చేయడం లేదని తెలియజేయగా తక్షణమే స్పందించిన జనసేన నాయకులు విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లి అధికారులతో మాట్లాడడం జరిగింది. విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి వెంటనే వెంటనే వెంకటేశ్వర నగర్ ఏరియా బోర్ మరమ్మత్తు పనులు ప్రారంభించారు. అంతేకాకుండా స్థానిక 29వ వార్డు జనసేన నాయకులు వెంకటేశ్వర్ నగర్ ఏరియాలో సిసి డ్రైన్లు మరియు సిసి రోడ్లు మరమత్తులు కూడా చేయాలని తెలియజేయగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే డిఈ ఇంజనీరింగ్ వర్క్స్ వేంకటేశ్వర రావు కి ఆదేశించి తక్షణమే నిర్మాణానికి అయ్యే వ్యయం అంచనా విలువ వేయాలని జి.వి.యం.సి కమిషనర్ తో మాట్లాడి వెంటనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తక్షణమే స్పందించి పనులు చేయిస్తున్న ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌కి, 29వ వార్డు జనసేన నాయకులకు స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు జనసేన సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్, జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్, జనసేన నాయకులు సారిపల్లి శ్రీనివాస్, లక్ష్మణ్, కర్రి చిన్ని, లోకేష్, రాజు, స్థానిక పెద్దలు, మహిళలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పి.పి.టి ద్వారా అవగాహన సదస్సు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఆర్.డి.డి.టి.పి మధుకుమార్ ఎల్.టి.పీలు, ప్లానింగ్ సిబ్బందికి మంగళవారం నాడు జిల్లా స్థాయి అవగాహన సదస్సును పి.పి.టి ద్వారా నిర్వహించారు. జిల్లాలోని కందుకూరు, బుచ్చి, అల్లూరు, ఆత్మకూరు ప్లానింగ్ సిబ్బంది అలాగే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు సంబంధించి ఎల్టిపీలను ఉద్దేశించి ఈ సందర్భంగా మధు కుమార్ మాట్లాడుతూ ప్రతి భవనమును ప్లానింగ్ సెక్రటరీలు ప్లానింగ్ సిబ్బంది సందర్శించి, భవన యజమానులకు బి.పి.ఎస్ గురించి అవగాహన కల్పించి వారి చేత బి.పి.ఎస్ కొరకు అర్జీ దాఖలా చేయించాలని తెలిపారు. తద్వారా వచ్చిన అప్లికేషన్లను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలని, అలాగే ఎల్.ఆర్.ఎస్ అప్లికేషన్లను వెంటనే వెరిఫై చేసి క్లోజ్ చేయాల్సిందిగా ఆదేశించారు. గతంలో బి.పి.ఎస్ కొరకు దాఖలు చేసిన దరఖాస్తులను ఈ స్కీము ద్వారా పూర్తి చేయించాలని సూచించారు. భవన యజమానులతో ముందుగా పదివేల రూపాయలు రుసుమును చెల్లించి అప్లికేషన్ రిజిస్ట్రేషన్ ద్వారా స్కీము పరిధిలోకి తీసుకొని రావాలని సూచించారు. ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ పథకాల అమలులో ఎల్.టి.పి లు వ్యక్తపరిచిన వివిధ సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి రఘునాధరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, నుడా ప్లానింగ్ ఆఫీసర్ కాలేషా, టి.పి.ఓ సతీష్, జిల్లాలోని లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, ప్లానింగ్ సిబ్బంది హాజరయ్యారు.

# పెద్దాపురం డివిజన్లోకి సామర్లకోట మండలం..?



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రస్తుతం కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న సామర్లకోట మండలంలోని తాజా జిల్లాల పునర్విభజనలో పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి మార్పు చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇచ్చిన సిఫార్సు మేరకు ఈ ప్రతిపాదన తాజాగా జిల్లాల పునర్విభజన అంశాల్లోకి వెళ్లినట్లు సమాచారం. సామర్లకోట మండలంలోని మున్సిపాలిటీతో పాటు 18 గ్రామ పంచాయతీలు ఉండగా పోలీస్ శాఖ పరంగా పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో ఉండగా, కోర్టు కాకినాడ పరిధిలో ఉంది, రెవెన్యూ డివిజన్ జిల్లా కేంద్రం కాకినాడలో ఉంది. సామర్లకోట నుండి పెద్దాపురంకు కేవలం రెండే కిలోమీటర్లు దూరం ఉండడంతో, ఈ విలీన ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం జరిగిన చర్చలో ఈ అంశాన్ని ఆమోదించినట్లు సమాచారం. అయితే కాకినాడకు సమీపంలో ఉన్న సామర్లకోట మండలంకు చెందిన మాధవపట్నం వికేరాయపురం బోయినపూడి అచ్చంపేట పనసపాడు పవర్ నవర పనసపాడు తదితర గ్రామాలకు కాకినాడ జిల్లా కేంద్రం చాలా దగ్గర. తాజా మార్పుతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పని పరిస్థితి నెలకొంది. ఈ విష యాన్ని స్థానిక రెవెన్యూ అధికార వర్గాల వద్ద ప్రస్తావించగా మండలం పెద్దాపురం డివిజన్లోకి మార్పు చేయాలన్న అంశం ప్రతిపాదన జరిగిన విషయం వాస్తవమేనన్నారు.

# డా. అంబేద్కర్ చిత్రపటం తొలగింపుపై దళిత నేతలు ఆగ్రహం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట ఐఎంఎల్ డిపో మేనేజర్ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా ఉంటున్న అంబేద్కర్ చిత్రపటం మూడు నెలల క్రితం మాయం కావడంపై దళిత సంఘాల నేతలు మంగళవారం కార్యాలయం వద్ద తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు. దీనిపై డిపో అధికారులను నిలదీశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి అవమానం జరగటం దారుణం అంటూ మాల మహానాడు నాయకులు, సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు ఉండగా, అంబేద్కర్ చిత్రపటం మాయం కావటం ఆశ్చర్యంగా ఉందని నేతలు ధ్వజమెత్తారు. తక్షమే అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దానిపై చిత్రపటం ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపడతామని డిపో సహాయ మేనేజర్ హామీ ఇచ్చారు. 24 గంటల్లో చిత్రపటాన్ని ఏర్పాటు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులు

**- ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జనరిక్ మందుల షాపు ఏర్పాటు**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు తక్కువ ధరలకే నాణ్యమైన మందులను అందించే విధంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జనరిక్ మందుల షాపును మంగళవారం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఆసుపత్రి లోపల ఉన్న జనరిక్ మందుల షాపును సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. ఆసుపత్రి రోగులే కాకుండా సాధారణ ప్రజలు సైతం జనరిక్ మందులు కొనుక్కునే విధంగా ఏర్పాటుచేసిన షాపును ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. ప్రభుత్వ జనరిక్ మందుల షాపులో ప్రజలు తక్కువ ధరకు మందులను కొనుక్కునే అవకాశం ఇప్పుడు ఏర్పడుతుందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పెచ్చెట్టి విజయలక్ష్మి, తిక్కిరెడ్డి నేతాజీ, వలవల శివరావు, అవుపాటి గోపాల్, నల్లా స్వామి, కర్రి రామస్వామి, గోలకోటి చిన్న, అశెట్టి ఆదిబాబు, యేడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, జంగా అబ్బాయి వెంకన్న, నల్లా చిట్టిబాబు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె శంకరరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'పెద్ది' చికిరి బెస్ట్ ఏఐ వర్షన్ చూశారా?



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. 2026 సమ్మర్‌లో మార్చి చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న పెద్ది సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు మొదలు పెట్టారు. ఇంకా విడుదలకు దాదాపుగా నాలుగు నెలల సమయం ఉంది. అయినప్పటికీ బుచ్చిబాబు సందడి మొదలు పెట్టాడు. ఈ స్పోర్ట్స్ డ్రామా నుంచి ఇప్పటికే వచ్చిన మొదటి షాట్ గ్లిమ్స్ సినిమాపై అంచనాలు పెంచిన విషయం తెల్సిందే. ముఖ్యంగా రామ్ చరణ్ బ్యాట్ పట్టుకుని ముందుకు వెళ్లి మరీ కొట్టిన షాట్‌కి అంతా క్లీన్ బౌల్డ్ అయ్యారు. అప్పటి నుంచి పెద్ది సినిమాను చూడాలని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ అంచనాలను మరింతగా పెంచే విధంగా చికిరి చికిరి అంటూ సాంగ్ వచ్చి ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. ఈ పాట మొత్తం సినిమా స్థాయిని రెట్టింపు చేసింది. జాన్వీ కపూర్ పాత్రను చూపిస్తూ, రామ్ చరణ్‌తో పాడించిన ఈ పాటకు మంచి స్పందన వచ్చింది. రామ్ చరణ్ డాన్స్ స్కిల్స్ మరోసారి ఈ పాట చూపించింది. ఇక సినిమాలో జాన్వీ కపూర్ ఎలా ఉండబోతుంది అనే విషయంలో ఒక క్లారిటీ ఇస్తూ బుచ్చిబాబు ఈ పాటలో ఆమె విజువల్స్‌ను ఇవ్వడం జరిగింది. జాన్వీ కపూర్ గ్లామర్ ఏమాత్రం తగ్గకుండా, పల్లెటూరి అమ్మాయిగా చూపడం ద్వారా ఆమె అభిమానులకు కన్నుల విందు చేయడం జరిగింది. చికిరి పాటకు లక్షల మంది రీల్స్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వారు, ముసలి వారి వరకు అంతా చికిరి చికిరి అంటూ బ్యాట్ స్టెప్ వేయడం, రకరకాలుగా మూమెంట్స్ చేయడం ద్వారా పాట వైరల్ అయింది. ఇప్పుడు పాట గురించి ప్రస్తుతం ఎక్కడ చూసినా చర్చ జరుగుతోంది. వీడియోలు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఒక ఏఐ వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గత కొన్ని నెలలుగా ఏఐ అనేది సోషల్ మీడియాలో ఏ స్థాయిలో ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో మనం చూస్తూనే ఉన్నాం. ప్రతి ఒక్క స్టార్‌ను ఏఐ ద్వారా క్రియేట్ చేసి ఇష్టానుసారంగా వాడేస్తున్నారు. అయితే చికిరి చికిరి పాటకు ఏఐ వర్షన్ వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. భలే చేశారే అని రామ్ చరణ్ ఫ్యాన్స్, జాన్వీ కపూర్ ఫ్యాన్స్‌తో పాటు సినిమాపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ కామెంట్ చేస్తూ షేర్ చేస్తున్నారు. జాన్వీ కపూర్ ఏఐ వర్షన్‌ను ఈ వీడియోలో చూపిస్తూ, లిరిక్స్‌కి తగ్గట్లుగా యాక్ట్ చేయించడం ద్వారా బెస్ట్ ఏఐ వీడియోగా ఈ వీడియో గుర్తింపు దక్కించుకుంది. ఇప్పటి వరకు చికిరి చికిరి అంటూ చాలా వీడియోలు వచ్చాయి. రీల్స్ రూపంలో వచ్చిన వీడియోలకు మంచి స్పందన వచ్చింది. అయితే ఇలా ఏఐ ద్వారా వీడియో రావడం అందరికీ సర్‌ప్రైజింగ్‌గా అనిపించి తెగ చూస్తున్నారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. రామ్ చరణ్‌ను గేమ్ ఛేంజర్ తర్వాత అభిమానులు ఈ సినిమాలో చాలా విభిన్నంగా చూడబోతున్నారు.

గతంలో చరణ్ నటించిన రంగ స్థలంను మించి ఈ సినిమా ఉంటుందని, ఈ సినిమాలోని ఆయన లుక్, పాత్రను బుచ్చిబాబు ప్రాణం పెట్టి డిజైన్ చేశాడని మేకర్స్ అంటున్నారు. మొదటి నుంచి ఈ సినిమాకు ఏఆర్ రహమాన్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. అన్నట్లుగానే ఆయన నుంచి వచ్చిన మొదటి పాట సెన్సేషన్ క్రియేట్ చేసింది. ముందు ముందు రాబోతున్న పాటలతో సినిమాను ఎక్కడికో తీసుకు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం సినిమా చివరి దశ షూటింగ్ జరుపు తున్న బుచ్చిబాబు ఈ సినిమాను అనుకున్న తేదీకి ఇవ్వాలని చాలా పట్టుదలతో ఉన్నాడు. 2026 మార్చి చివరి వారంలో ఖచ్చితంగా సినిమా వచ్చి తీరుతుందని మేకర్స్ నుంచి కూడా ప్రకటన వచ్చింది. ఈ సినిమాపై ఉన్న అంచనాలు పెంచే విధంగా చికిరి హిట్ కావడంతో మేకర్స్ మరింత ఉత్సాహంగా వర్క్ చేస్తున్నట్లు తెలుస్తోంది.


# 16.. 17 ఏళ్ల వయసులోనే... కీర్తి మహా ముదురు గురూ..!




ఈతరం ప్రేక్షకులకు మహానటి సావిత్రిని వెండి తెరపై చూపించే అవకాశం యంగ్ హీరోయిన్ కీర్తి సురేష్ దక్కించుకుంది. అంతకు ముందు కొన్ని సినిమాలు చేసినప్పటికీ మహానటి సినిమా తర్వాత కీర్తి సురేష్ కెరీర్ మొత్తం మారిపోయింది. ఆమె పాన్ ఇండియా స్టార్ హీరోయిన్‌గా మారింది. టాలీవుడ్, కోలీవుడ్ అప్పుడప్పుడు బాలీవుడ్ ఇతర భాషల సినిమాల్లోనూ కీర్తి సురేష్ నటిస్తూ బిజీ బిజీగా ఉంది. ఇటీవల ఈ అమ్మడు తన చిరకాల ప్రియుడు ఆంటోనీని పెళ్లి చేసుకున్న విషయం తెల్సిందే. పెళ్లి కొన్ని నెలలకు జరగబోతుంది అనే వరకు కూడా కీర్తి సురేష్ లవ్ వ్యవహారం ఏ ఒక్కరికీ తెలియదు. కానీ ఆమె ఆంటోనీతో ఏకంగా 15 ఏళ్లుగా రిలేషన్‌లో ఉంది. ఆ విషయాన్ని పెళ్లి సమయంలో స్వయంగా చెప్పుకొచ్చింది. అంతే కాకుండా తమ ప్రేమకు సంబంధించిన విషయాలను మెల్ల మెల్లగా రివీల్ చేస్తూ వస్తోంది. ఇటీవల ఒక సందర్భంగా కీర్తి సురేష్ తన ప్రేమ విషయాన్ని చెప్పుకొచ్చింది. 15 ఏళ్ల సుదీర్ఘ ప్రేమ కథ తమది అంటూ కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. అంతే కాకుండా కాలేజ్ రోజుల్లో తాను ఆంటోనీతో ప్రేమలో పడ్డట్లుగా పేర్కొంది. ఆన్ లైన్ ద్వారా ఆంటోనీ పరిచయం అయ్యాడు అంది. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ రాకముందు ఆర్కుట్ అనే సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఉండేది. ఈ జనరేషన్ వారికి అది తెలియక పోవచ్చు. ఆ సమయంలో ఆర్కుట్ చాలా ఫేమస్ అయ్యింది. అందులో స్నేహితులు అయ్యేవారు. అలా కామన్ ఫ్రెండ్స్ ద్వారా ఆంటోనీతో కీర్తి సురేష్‌కి ఫ్రెండ్‌షిప్ మొదలైంది. ఇద్దరు ఆన్ లైన్ ద్వారా స్నేహం మొదలు పెట్టి, చాటింగ్ చేసుకునే వారట. నెల రోజుల పాటు చాటింగ్ చేసుకున్న తర్వాత ఒకసారి కొచ్చిన్‌లోని ఒక రెస్టారెంట్‌లో ఆంటోనీని కీర్తి సురేష్ చూడటం జరిగిందట. ఆ సమయంలో కీర్తి సురేష్ ఫ్యామిలీతో ఉండటంతో మాట్లాడటం వీలు పడలేదట. కానీ ఆ సమయంలో ఆంటోనీ దృష్టిలో పడే విధంగా కీర్తి సురేష్ కన్ను కొట్టిందట. అప్పుడు ఆంటోనీ ఈ అమ్మాయి ఏంటి ఇలా చేస్తుందని షాక్ అయ్యాడట. ఆ తర్వాత కొన్ని రోజులకు ఒక మాల్‌లో మేము ఇద్దరం కలిశాం. అప్పుడే మాటల మధ్యలో నీకు గట్స్ ఉంటే నాకు ప్రపోజ్ చేయి అంటూ రెచ్చగొట్టాను. అలా అంటే ఏ అబ్బాయి అయినా ఊరుకుంటాడా... ఆంటోనీ నాకు ప్రపోజ్ చేశాడు. అప్పుడు నేను అతడిని బలవంత పెట్టి లవ్ ప్రపోజల్ చేయించినట్లు అనిపించింది అని కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. ఆ సమయంలో తన ప్రవర్తన గురించి ఇప్పుడు ఆలోచిస్తే నవ్వు వస్తుందని కీర్తి సురేష్ సరదాగా వ్యాఖ్యలు చేసింది. ఆ సమయంలో ఆంటోనితో ప్రేమ మొదలైంది అన్నట్లుగా తన ప్రేమ కథను కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. ఆర్కుట్ రోజుల్లో అంటే 2005 నుంచి 2008 మధ్య కాలం అయ్యి ఉంటుంది. ప్రస్తుత కీర్తి సురేష్ వయసును బట్టి చూస్తే అప్పుడు కేవలం 16 లేదా 17 ఏళ్లు ఉండి ఉంటాయి. మహా అయితే 18 ఏళ్లు అయ్యి ఉంటుంది.

అంత చిన్న వయసులోనే కీర్తి సురేష్ చాలా డేర్‌గా ఒక అబ్బాయిని మాల్‌లో పట్టుకుని రెచ్చగొట్టి మరీ అతడితో ప్రపోజ్ చేయించింది అంటే మామూలు విషయం కాదు. కీర్తి సురేష్ మహా ముదురు అని ఈ ఘటన చెప్పకనే చెబుతోంది అంటూ కొందరు సోషల్ మీడియాలో అప్పుడే లెక్కలు వేసి మరీ కామెంట్స్ చేస్తున్నారు. అయితే కెరీర్‌లో సెటిల్ కావడం కోసం ప్రేమ విషయాన్ని బయటకు రాకుండా, వెంటనే పెళ్లి చేసుకోకుండా ఉండటం అనేది చాలా గొప్ప విషయం. 15 ఏళ్లు వీరి ప్రేమ బంధం కొనసాగిందంటే వీరు కచ్చితంగా జీవితాంతం చాలా సంతోషంగా వైవాహిక జీవితాన్ని సాగిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# రేణు దేశాయ్.. ఈసారైనా పవర్‌ఫుల్ రోల్ దక్కుతుందా?



సీనియర్ హీరోయిన్ రేణు దేశాయ్ గురించి అందరికీ తెలిసిందే. గతంలో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించిన ఆమె.. పెళ్లి తర్వాత ఇండస్ట్రీకి దూరమయ్యారు. పర్సనల్ వర్క్స్‌తో బిజీగా గడిపారు. మళ్లీ ఆమె మూవీల్లోకి రావాలని అప్పట్లో అనేక మంది ఆడియన్స్ కోరుకున్నారు. అనుకున్నట్లే ఇటీవల రీ ఎంట్రీ ఇచ్చారు. మాస్ మహారాజా రవితేజ లీడ్ రోల్‌లో నటించిన టైగర్ నాగేశ్వరరావు మూవీతో లాంగ్ గ్యాప్ తర్వాత సిల్వర్ స్క్రీన్ పై మెరిశారు రేణు దేశాయ్. ఆ సినిమాలో సామాజిక కార్యకర్త హేమలత లవణం రోల్‌లో కనిపించారు. హీరో రోల్‌ను ప్రభావితం చేసే కొన్ని కీలక సన్నివేశాల్లో నటించిన రేణు.. తన యాక్టింగ్‌తో అందరినీ మెప్పించారు. ఆడియన్స్‌ను ఆకట్టుకుని, విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా అందుకున్నారు. కానీ రీ ఎంట్రీలో ఫస్ట్ మూవీతో అనుకున్న స్థాయిలో హిట్ సాధించలేకపోయారు. ఆ తర్వాత రేణు దేశాయ్ మరో కొత్త మూవీలో యాక్ట్ చేస్తున్నట్లు అనౌన్స్‌మెంట్ రాలేదు. అయితే ఇప్పుడు మరో సినిమాలో కనిపించనున్నారు. తాజాగా పూజ సెర్మనీ జరిగింది. కంప్లీట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 16 రోజుల పండుగ సినిమాలో యాక్ట్ చేస్తున్నారు రేణు దేశాయ్. నిర్మాత డీఎస్ రావు కుమారుడు కృష్ణ దమ్మలపాటి హీరోగా నటిస్తున్న ఆ మూవీని దర్శకుడు సాయికిరణ్ అడవి తెరకెక్కిస్తున్నారు. ఆ సినిమాలో రేణు దేశాయ్ ఇప్పుడు ప్రధాన పాత్రలో యాక్ట్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే 16 రోజుల పండుగలో రేణుకు ఎలాంటి రోల్ దక్కుతుందోనని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. నిజానికి టైగర్ నాగేశ్వరరావు మూవీలో ఆమెకు మంచి పాత్ర దక్కిందనే చెప్పాలి. కానీ ఇప్పుడు సీనియర్ నటి నదియా సహా పలువురు చేస్తున్న పవర్ ఫుల్ రోల్స్‌లాంటి పాత్రల కోసం రేణు దేశాయ్ వెయిట్ చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు ఆమెకు అలాంటి పాత్రలు దక్కలేదు. అందుకే టైగర్ నాగేశ్వరరావు మూవీ తర్వాత చిన్న గ్యాప్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే 16 రోజుల పండుగ మూవీలోని రోల్‌కు సంబంధించిన పార్ట్‌ను తనను నెరేట్ చేశాక.. బాగా నచ్చి సినిమాలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. మరి 16 రోజుల పండుగ మూవీలో రేణు దేశాయ్ పాత్ర ఎలా ఉంటుందో.. ఎలాంటి హిట్ అందుకుంటారో.. ఎంతలా మెప్పిస్తారో వేచి చూడాలి.

# రజినీ కోసం అతడికి రూ.10 కోట్లు ఇస్తున్న కమల్?



కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కబోయే ప్రాజెక్టుపై అటు సినీ ప్రియుల్లో.. ఇటు అభిమానుల్లో ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఇండస్ట్రీలో అత్యంత అరుదైన కాంబినేషన్‌గా నిలిచే ఆ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఆ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రాగా.. దర్శకుడిగా సి.సుందర్‌ను ప్రకటించారు. కానీ ఆయన ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. అనుకోని పరిస్థితులు కారణంగా తప్పుకోవాల్సి వచ్చిందని తెలిపారు. రజినీ కాంత్, కమల్ హాసన్ అభిమానులకు కలిగిన నిరాశకు నిజమైన క్షమాపణలు అంటూ లెటర్ విడుదల చేశారు. దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ తప్పుకున్న తర్వాత రజినీ- కమల్ ప్రాజెక్ట్‌కు కొత్త డైరెక్టర్ ఎవరు అన్న విషయంపై జోరుగా చర్చ సాగుతోంది. మొదట్లో లోకేష్ కనగరాజ్, కార్తీక్ సుబ్బరాజ్ పేర్లు వినిపించగా.. ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రీసెంట్‌గా పార్కింగ్ మూవీ ఫేమ్ రామ్ కుమార్ బాలకృష్ణ పేరు ఇప్పుడు ప్రచారంలోకి వచ్చింది. రామ్ కుమార్ బాలకృష్ణన్ నెరేట్ చేసిన స్టోరీ.. అటు రజినీకి.. ఇటు కమల్‌కు నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కోలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. దీంతో యంగ్ డైరెక్టర్‌కు ఇంత పెద్ద అవకాశం దక్కడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఇప్పుడు ఆ డైరెక్టర్ రెమ్యూనరేషన్‌పై సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. రామ్ కుమార్ బాలకృష్ణన్‌కు రూ.10 కోట్లు ఇవ్వనున్నారని ఇప్పుడు ప్రచారం జరుగుతోంది. దీంతో అంతా షాక్ అవుతున్నారు. ఎందుకంటే ఆయన పార్కింగ్ మూవీకి గాను కేవలం రూ.6 లక్షల పారితోషికం తీసుకున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శింబుతో వర్క్ చేస్తున్నారు. ఆ సినిమాకు రూ.2 కోట్లు తీసుకుంటున్నారు. కానీ ఇప్పుడు రజినీ- కమల్ మూవీకి ఏకంగా రూ.10 కోట్లు అందుకోనున్నారని తెలుస్తోంది. దీంతో తక్కువ టైమ్‌లోనే అంత పెద్ద మొత్తంలో రెమ్యూనరేషన్ అందుకోనుండడం గమనార్హం. రెండేళ్లలోనే రూ.6 లక్షల రేంజ్ నుంచి రూ.10 కోట్ల రేంజ్‌కు చేరుకున్నారని చెప్పాలి. అయితే ఆ విషయంపై ఇంకా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు. బాలకృష్ణన్ కూడా ఎక్కడా ఇప్పటి వరకు కమల్, రజినీ మూవీకి వర్క్ చేస్తున్నట్లు రివీల్ చేయలేదు.

# రైతుల అభ్యున్నతే లక్ష్యం : రెండవ విడత నీటి విడుదల చేసిన ఎమ్మెల్యే కాకర్ల

**- అన్నవరం గేటు వద్ద నీటి విడుదల - రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందన్న ఎమ్మెల్యే కాకర్ల**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా రబీ పంటలకు నీటి సరఫరా సమృద్ధిగా అందించే దిశగా మరో కీలకమైన ముందడుగు పడింది. జలదంకి మండలం అన్నవరం గ్రామం సమీపంలోని చిన్నక్రాక బ్యాలెన్సింగ్ గేటు నుండి దిగువ ప్రాంతాలైన బ్రాహ్మణక్రాక మేజర్, గౌరవరం మేజర్ కాల్వలు మరియు కావలి పెద్ద చెరువుకు రెండవ విడతగా నీటిని విడుదల చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, వారి సతీమణి కాకర్ల ప్రవీణ హాజరయ్యారు. వారు స్వయంగా గేట్లను ఎత్తి పంట భూముల కోసం నీటిని విడుదల చేయడం ద్వారా రైతులకు ఎంతో నమ్మకం మరియు ఆనందాన్ని కలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ "రైతుల సమస్యలను అర్థం చేసుకొని, వారికి అండగా నిలబడటం మా కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. రైతుల కళ్లల్లో కనిపించిన ఆనందం మా ప్రయత్నాలకు నిదర్శనం. ఇది నిజమైన రైతు ప్రభుత్వం" అని తెలిపారు. అలాగే, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రెండు విడతలలో 14,000 రూపాయలను అందజేస్తూ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సేవలను ఆయన ప్రశంసించారు. రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న మరిన్ని సానుకూల చర్యలను ప్రస్తావిస్తూ బిందు సేద్యానికి 90% వరకు సబ్సిడీ అందిస్తున్నామనీ, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే ఎన్నో సంస్కరణలను అమలు చేస్తున్నామనీ ఎమ్మెల్యే తెలియజేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రతి అడుగులోనూ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధి మరియు వ్యవసాయ రంగ ప్రగతి కోసం నిరంతరం పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# "మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, 2వ డివిజన్ గుడపల్లిపాడు నందు "రచ్చబండ" కార్యక్రమం : ఆనం విజయకుమార్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 2వ డివిజన్ గుడపల్లిపాడు నందు "రచ్చబండ" కార్యక్రమం నిర్వహించి 'ప్రజా ఉద్యమం' సంతకాల సేకరణ కార్యక్రమం 2వ డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, నెల్లూరు నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, 2వ డివిజన్ నాయకులు కోడూరు వెంకటసుబ్బారెడ్డి, నాగ శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణయ్య, సాయి, సోప్ప మల్లికార్జున, షబ్బీర్, ఖాదర్ వలీ, కృష్ణ, కృప పాల్, భాష, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు గుంటక వంశీ, 25వ డివిజన్ ఇంచార్జ్ షేక్ ఖాదర్ భాష, 1వ డివిజన్ ఇంచార్జ్ కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకారం : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ





**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, రసాయనిక ఎరువులు, పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు చేయడంతో పాటు అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే నెల వల విజయశ్రీ సూచించారు. ఆమె పెళ్లకూరు మండలం పరిధిలోని రావులపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన "రైతన్నా... మీకోసం" అను కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెకు చిల్లకూరు సొసైటీ చైర్మన్ కె.వి నాయుడు సారధ్యంలో ఘన స్వాగతం పలికారు. రైతుల అభివృద్ధి కోసం అమలు చేయబోతున్న సమగ్ర విషయాలు కలిగిన కరపత్రాలను రావులపాడులో పంపిణీ చేశారు. ఈ పథకం ప్రాధాన్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి వెన్నెముకలాంటి రైతుల బాబు కోరే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. రైతు వ్యవసాయ సాగులో నష్టపోకుండా లాభాల బాటలో నడిచే విధంగా వ్యవసాయ శాఖ సర్వే చేసి అవసరమైన సౌకర్యాలు అన్నిటిని సమకూర్చుతుందని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా అనుకున్న నెలలోపే 20 వేల రూపాయలు పూర్తిగా రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు. పండించిన ధాన్యాన్ని దళారులు పాలు కాకుండా సది అయిన గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. అన్ని రంగాల్లో అభివృద్ధికి పరుగులు పెట్టిస్తూ, రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కోటను ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా చిల్లకూరు సొసైటీ చైర్మన్ కె.వి.నాయుడు మాట్లాడుతూ మండల పరిధిలో పుష్కలంగా వరినట్లు సాగుతున్నాయని, వారికి అవసరమైన ఎరువులను నోటు లేకుండా రైతులకు అందుబాటులో ఉన్న ఆర్.బి ఎస్ కే కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, మండల పార్టీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, వాకిరి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మూగజీవుల సంరక్షణ బాధ్యత మున్సిపాలిటీదే



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ వీధి కుక్కల సంరక్షణ గురించి సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ నాయుడుపేట పట్టణంలోని 300 వీధి కుక్కలను సంరక్షణశాల తరలింపుకు చర్యలు త్వరలో చేపడతామని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వీధి కుక్కలకు ప్రాణహాని కలగకుండా సుప్రీం కోర్ట్ ఆదేశాలను అనుసరిస్తూ నాయుడుపేట పశు వైద్యుడుతో సంప్రదించి అక్కడే ఒక్క ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించి. వాటి సంరక్షణ కోసం నగర శివారుల్లో వాటికి షెడ్లు ఏర్పాటు చేసి భోజన వసతి కల్పించి. కుక్కల సంరక్షకులను నియమించి వాటి బాగోగులు చూసుకుంటాం అని తెలియజేశారు.

# కూడు, గుడ్డ, నీడ తెలుగుదేశం నినాదం

**- నాటి స్వర్గీయ ఎన్టీఆర్ వద్ద నుంచి నేటి యువనేత, మంత్రి లోకేష్ వరకు పేదోళ్ల సొంతింటి కల నెరవేర్చడమే టిడిపి విధానం - పక్కా ఇళ్ల లబ్దిదారులకు ప్రభుత్వం ద్వారా 2 లక్షల 50 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం - ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం - పక్కా ఇళ్ల నిర్మాణానికి లబ్దిదారులకు ప్రభుత్వం ద్వారా రూ. 2 లక్షల 50 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం - సొంత ఇళ్ళు , ఇంటి స్థలాలు లేని ప్రతి ఒక్కరు పిఎంఏవై సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకోండి - బుచ్చిరెడ్డి పాళెం పట్టణ పరిధిలో సొంత స్థలం వున్న 285 మందికి తొలి విడతగా పక్కా గృహాల లబ్దిదారులుగా ఎంపిక చేసాం : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజావసరాలు గుర్తించి పాలన చేసే పాలకుడన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో పక్కా ఇళ్ల నిర్మాణానికి ఎంపికయిన లబ్దిదారులకు ఆమె మంజూరు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేదల సొంత ఇంటి కల నెరవేర్చే కార్యక్రమంలో పాల్గొనడం పట్ల సంతోషం ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి స్వర్గీయ నందమూరి తారక రామారావు నుంచి నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు యువ నాయకులు మంత్రి లోకేష్‌ల వరకు ప్రతి ఒక్కరికి కూడు, గుడ్డ, నీడ కల్పించడమే తెలుగుదేశం పార్టీ విధానమన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక హౌసింగ్ అధికారులతో నిర్వహించినన్ని సమీక్షా సమావేశాలు మరే శాఖ అధికారులతో నిర్వహించలేదన్నారు. తాను ఎన్నికల సందర్భంగా ఎక్కడికెళ్లినా నాడు ఎన్టీఆర్ హయాంలోనే.. చంద్రబాబు నాయుడు హయాలోనే కట్టిన ఇళ్లనే చూశానన్నారు. పగుళ్లు బారిన పాత ఇళ్లను మరమ్మత్తులకు చూపించేందుకు ఈ సందర్భంగా కృషి చేస్తానన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణ పరిధిలో సొంత స్థలం వున్న 285 మందికి తొలి విడతగా పక్కా గృహాల లబ్దిదారులుగా ఎంపిక చేసామని, పక్కా ఇళ్ల నిర్మాణానికి లబ్దిదారులకు ప్రభుత్వం ద్వారా 2 లక్షల 50 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. సొంత ఇళ్ళు, ఇంటి స్థలాలు లేని ప్రతి ఒక్కరు PMAY సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేసారు. ఇళ్ళు లేదా ఇంటి స్థలాలు కావాల్సిన వారు కూడా సమీప సచివాలయాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అన్ని మండలాల ఎంపీడీవోలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ళు లేదా ఇంటి స్థలాల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా పేదలకు ఇంటి స్థలాల పంపిణిలో జాప్యం జరిగిందన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళు లేదా ఇంటి స్థలం మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామి యిచ్చారు. స్థానిక తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమీషనర్ డి బాలకృష్ణ, హౌసింగ్ ఎఇ పెంచలయ్య, మున్సిపల్ చైర్మన్ మోర్ల సుప్రజ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ విజయలక్ష్మి, మండల అధ్యక్షులు గుత్తా శీనయ్య, మాజీ మండల అధ్యక్షులు ఎం.వి. శేషయ్య, బత్తల హరికృష్ణ, వైస్ చైర్మన్లు, నగర పార్టీ కౌన్సిలర్లు, మండల క్లస్టర్, యూనిట్ మరియు బూత్ కన్వీనర్లు, బీజేపీ మరియు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# జడ్పీ సీఈఓని కలిసిన ఏపీఎన్జీవో నేతలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈరోజు ఉదయం 10 గంటలకు ఏపీఎన్జీవో అసోసియేషన్ నాయకులు జెడ్పీ సీఈవో గౌరవనీయులు ఎల్ శ్రీధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్కాకుల పెంచలయ్య వింజమూరు తాలూకా అధ్యక్షులు వెలుగోటి మధు మరియు కార్యవర్గ సభ్యులు మహిళా ఎన్జీవో నేతలు కే అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



# పంచమి తీర్థం సందర్భంగా అమ్మవారికి సారె అందజేత

**- సారెను అందించిన టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో అనిల్ సింఘాల్ తదితరులు - కార్యక్రమంలో పాల్గొన్న కోవూరు ఎమ్మెల్యే, బోర్డు మెంబర్ ప్రశాంతమ్మ**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన మంగళవారం పంచమి తీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె తిరుచానూరు పద్మావతి అమ్మవారికి చేరింది. మంగళవారం ఉదయం టీటీడీ బోర్డు ఛైర్మన్ బి.ఆర్ నాయుడు, ఈవో అనిల్ సింఘాల్ తదితరులు ఉదయం అమ్మవారికి సారెను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే, బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఏటా పంచమి తీర్థం రోజున తిరుమల నుంచి సారెను తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసిమాల, వస్త్రాలు, ఆభరణాలతో కూడిన సారెను గజాలపై ఆలయ నాలుగు మాడ వీధుల గుండా ఊరేగించి అనంతరం కాలినడకన తిరుమల నుంచి తిరుపతిలోని అలిపిరి వద్దకు తీసుకు వచ్చారు. అక్కడి నుండి కోమలమ్మ సత్రం, తిరుచానూరు పసుపు మండపం మీదుగా పద్మపుష్కరిణి వద్ద అమ్మవారికి సారె సమర్పించారు.

# అర్హులందరికీ పక్కా ఇల్లు

## - నవంబర్ 30లోగా దరఖాస్తు చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ఇల్లు లేని పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని గ్రామాల్లో అర్హత ఉండి ఇల్లు లేని నిరుపేదల కోసం 100% డిమాండ్ సర్వే జరుగుతోందనీ తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి ఈ నెల 30 వరకు మాత్రమే గడువు ఉందని, అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాబోయే 5 సంవత్సరాలలో ఎవరికైనా పక్కా ఇల్లు కావాలంటే, ఈ నెలాఖరులోపు తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అర్హతల వివరాలు ఇలా ఉన్నాయి. ఎవరు నమోదు చేసుకోవచ్చు? గృహం లేని మరియు స్థలం లేని కుటుంబీకులు, తెల్ల రేషన్ కార్డు ఉండాలి, ఇంతకుముందు ఏ ఇతర ప్రభుత్వ పథకంలోనూ లబ్ధి పొంది ఉండకూడదు. సొంత స్థలం ఉన్నా లేకపోయినా నమోదు చేసుకోవచ్చు. స్థలం లేని వారికి, తర్వాత స్థలం మంజూరు అయిన తర్వాత పక్కా ఇల్లు మంజూరు చేయబడుతుంది. నమోదు చేసుకునే విధానం: మీ వివరాలను 'ఆవాస్ ప్లస్ యాప్' ద్వారా నమోదు చేయించుకోవాలి. మీరు నివసించే సచివాలయం పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్. లేదా మండల హౌసింగ్ సహాయక ఇంజనీరుని సంప్రదించండి. లబ్ధిదారులు తమ ఇంటి దగ్గరే ఉండి, ముఖ ఆధారిత నమోదు ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలి.

కావలసిన పత్రాలు: పేరు నమోదు సమయంలో ఈ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి: స్థల ధృవీకరణ పత్రాలు (మీకు స్థలం ఉంటే) జాబ్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా (అకౌంట్) వివరములు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఈ గొప్ప అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# స్వచ్ఛందంగా సంతకాలు సేకరణ

**డాక్టర్.బి ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ ఆర్సిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ ఆధ్వ ర్యంలో అమలాపురం నియోజకవర్గంలో స్థానిక ఓ ప్రైవేటు కళాశాల నందు మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేక ముగా అలాగే విద్యార్థుల ఆ మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ అయితే జరిగే నష్టాలను, అదే మెడికల్ కళాశాలలో ప్రభుత్వ పరంగా నడుపుతే జరిగే లాభాలను విద్యార్థులకి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ వివరించి స్వచ్ఛందంగా సంతకాలు సేకరించడం జరిగినది. ఏదైతే ఈ కూటమి ప్రభుత్వం ఏడాదికి 99 రూపాయలకే ఈ ఒక మెడికల్ కాలేజ్ భూములను లీజులకి ఇవ్వడం చాలా దారుణమని అన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజ్, హాస్పటల్ అన్నది మన అందరి హక్కు అని దీన్ని మనందరం కాపాడుకోవాలని శిరీష్ కోరారు. ఈ



కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్, జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి మాదిరెడ్డి లావరాజు, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చప్పిడి లీల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 3 వేలు క్రికెట్ కిట్టు అందజేత



**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం, (రాజధాని వార్తలు):** అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన పల్లి శేఖర్ కుమారుడు పల్లి హేమంత్ కుమార్‌కి 30,000/- రూపాయల ఖరీదు గల క్రికెట్ కిట్టును వై.యస్.ఆర్ సీపీ అమలాపురం నియోజకవర్గ సీనియర్ లీడర్, గుడ్ సీడ్ ఫౌండేషన్ చైర్మన్ కుంచే రమణారావు వారి కార్యాలయము నందు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో షేక్ బాబ్జి, నక్కా సంపత్, నేరేడుమిల్లి శ్రీను, గంటా ప్రసాద్, పందిరి సుబ్బరాజుతో పాటు గ్రామస్థులు పల్లి నరేష్, వెంకన్న బాబు, జల్లి సుధీర్, బూసి సత్య జయంత్, పల్లి ఫణి కుమార్, జల్లి విజయ్, జల్లి ప్రవీణ్, మెడమెల్ల ఆదిత్య, మేడిద అక్షయ పౌల్ పాల్గొన్నారు.

# ఆ స్నేహానికి 40 ఏళ్లు

## - ఎన్నో కష్టాలు ఒడిదుడుకులు మధురస్మృతులతో సుదీర్ఘ రాజకీయ ప్రయాణం - ఎవరా స్నేహితులు ..?

**కొత్తపేట నియోజకవర్గం, (రాజధాని వార్తలు):** చరిత్ర కలిగిన కొత్తపేట నియోజకవర్గంలో ఎంతోమంది ప్రముఖులు రాజకీయ ముఖచిత్రంలో నిలిచారు. పూర్వం బ్రాహ్మణులు, క్షత్రియులు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే రాజకీయ పగ్గాలు చేపట్టారు. నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన కాపు సామాజిక వర్గంలో చైతన్యం తీసుకొచ్చి మొట్టమొదటిగా బండారు సత్యానందరావు ఎమ్మెల్యే కాగలిగారు. వారితోపాటు స్నేహితుడైన ధర్నాల రామకృష్ణ రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. వీరి స్నేహితుడికి అండదండలు అందిస్తూ ఆయన కూడా రాజకీయంగా ఎదిగారు. ఎంపీటీసీగా మందపల్లి దేవస్థానం చైర్మన్గా జడ్పిటిసిగా ఆయన పలు పదవులు చేపట్టారు. ఇద్దరి రాజకీయ ప్రస్థానం 40 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ 40 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులు కష్టాలు మధుర స్మృతులు మధ్యన రాజకీయ ప్రస్థానం సాగింది. వారి ఇరువురి కలయికలో ఎన్నో రాజకీయ సమస్యలను అధిగమించారు అభివృద్ధిని చూశారు. ఇది కొత్తపేటలో అందరికీ తెలిసిన విషయమే అయితే ఇప్పుడు ఏంటా విషయం కొత్తగా అంటే ధర్నాల రామకృష్ణ సొంత గ్రామంలో సుమారు ఐదు కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. దానికి కర్త కర్మ క్రియ అన్ని తానై ఈరోజు పలు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు ధర్నాల రామకృష్ణ ఏర్పాటు చేశారు. వీరి స్నేహానికి అర్థం వచ్చేలా బండారు సత్యానందరావు పేరు మీద కొన్ని కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ట్రబుల్ షూటర్ రామకృష్ణ వివాదాలు, సమస్యలను తగువులను పరిష్కరించడంలో ఆయన నేర్పరితనం సామర్థ్యంతో ధర్నాల రామకృష్ణ ట్రబుల్ షూటర్‌గా



పేరుగాంచారు. ఇప్పటికి ఏదైనా కొన్ని కీలక బాధ్యతలను ఆయనకే అప్పచెబుతారని చెప్పుకుంటారు. పార్టీలతో ప్రమేయం లేకుండా స్నేహానికి విలువనిస్తూ ఆయన వెన్నంటే ప్రయాణిస్తున్న వీరి స్నేహం ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ...వీరు తలపెట్టిన కార్యక్రమాలు జయప్రదం కావాలని సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి ఆశిస్తున్నట్లు తెలిపారు.

# త్వరలో రాష్ట్ర పండుగగా జగ్గన్న తోట ప్రబల తీర్థం

**రాజోలు, (రాజధాని వార్తలు):** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహించే "జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని" రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబునాయుడు సమ్మతించారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం రాజోలు పర్యట నలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి కోనసీమ వాసులు ఈ అంశాన్ని తీసుకు వచ్చి వినతి పత్రం అందించగా మంత్రి దుర్గేష్ స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగగా జరుపుకునే సంక్రాంతిని పురస్కరించుకొని ఏటా లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగే జగ్గన్న తోట ప్రభల తీర్థ మహోత్సవానికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రిగా తాను, సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్విని పొడపాటి వేర్వేరు సందర్భాల్లో 450 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. ఈ క్రమంలో ప్రభల తీర్థాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం వెంటనే సమ్మతించారని స్పష్టం చేశారు. ప్రతి ఏటా కన్నుల పండువగా జరిగే ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తి పారవశ్యంలో మునిగి తేలుతారన్నారు. ఎన్నో తరాల నుండి సంప్రదాయంగా వస్తోన్న ఈ ప్రభల తీర్థం జరిగే సమయంలో పండుగ వాతావరణం నెలకొని అధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందన్నారు.

వీటన్నింటితో పాటు కోనసీమ వాసుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఏకాదశ రుద్రులతో పాటు వివిధ రూపాలతో తీసుకువచ్చే జగ్గన్నతోట ప్రభల తీర్థ అద్భుత ఘట్టాన్ని అందరం కలిసి ఘనంగా నిర్వహించుకుందామని, అదే విధంగా ప్రపంచా నికి చాటి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# రైతన్న సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## - అన్నదాతల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే చేపడుతుంది : ఏఎంసి చైర్మన్ గోపాలరాజు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రైతన్న సంక్షేమమే ధ్యేయముగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్థానిక ఏ.ఎం.సి చైర్మన్ పి.వీ.వీ గోపాలరాజు అన్నారు. రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన పురిటిపెంట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నదాతల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ముఖ్యముగా నీటి భద్రత, ఆహార భద్రత, పెట్టుబడి తగ్గించుట, దిగుబడి పెంచుట, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించుట, సరకు ధర పెరుగుదల, మార్కెట్ ఆధారిత పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు వంటి పలు అంశాలుకి సంబంధించి రైతుకు వివరణ పూరిత పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ గొర్లె బంగారు నాయుడు, ఆదిలక్ష్మీ, బుజ్జి రాజు, డి.వి. ఆర్ మాస్టర్, వేణు, అప్పల స్వామి, మంత్రి త్రినాధ, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.


# మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇరువురికి వారం రోజుల జైలు శిక్ష : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్ .దామోదర్ ఆదేశాల మేరకు గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఏ వి రమణ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇరువురిని పట్టుకోవడం జరిగిందని ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాల ప్రకారం బొండపల్లి మండలం గిట్టుపల్లి గ్రామానికి చెందిన దేనిబోని సూరిబాబు , పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన దవల సంతోష్ కుమార్‌లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని బ్రీత్ అనలైజర్ పరీక్ష ద్వారా తెలుసుకున్నామని కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. అనంతరం వారిద్దరిని అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట గజపతినగరం ఏ.విజయ్ రాజ్ కుమార్ వారి సమక్షంలో హాజరు పరచగా మెజిస్ట్రేట్ వారు ఇరువురు ముద్దాయిలకు వారం రోజులు పాటు జైలుశిక్ష విధించడం జరిగిందని ఎస్.ఐ కిరణ్ కుమార్ నాయుడు చెప్పారు. కొద్ది రోజుల క్రితమే బొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇరువురికి మెజిస్ట్రేట్ వారు వారం రోజులపాటు జైలు శిక్ష విధించిన విషయం పాఠకులకు విదితమే. శిక్ష పడిన ఇద్దరినీ విజయనగరం సబ్ జైలుకు అప్పగించడం జరిగిందని ఆయన విలేకరులకు తెలియజేశారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి ఆరోపణలపై బహిరంగ విచారణ - హాజరుకాని రైతులు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** భూముల మ్యుటేషన్ చేయడానికి విజయనగరం మండల రెవెన్యూ కార్యాలయంలో లంచం అడుగుతున్నారన్న ఫిర్యాదులుపై విచారణ నిర్వహించేందుకు, అధికారులు వచ్చినా, ఫిర్యాదు దారులు రాలేదు. అయితే ఫిర్యాదు దారులకు విచారణ జరుగుతుందనే సమాచారం ఇవ్వకపోవడం వల్లనే వారు విచారణకు రాలేదని తెలుస్తోంది. అవినీతి ఆరోపణలపై బహిరంగ విచారణ చేపట్టేందుకు పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉపకలెక్టర్ మురళి తహశీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. తహశీల్దార్ కూడా కార్యాలయంలో వున్నారు. సమయం గడుస్తున్నా ఫిర్యాదు చేసిన రైతులు విచారణకు రాకపోవడంతో అసలువారికి సమాచారంఅందిందాలేదా అని కూడా ఆరా తీశారు. అయినా వేచి చూస్తామని విచారణాధికారి మురళి కార్యాలయంలోనే వున్నారు. విజయనగరం తహశీల్దార్ కార్యాలయంలో మ్యుటేషన్ చేయడానికి, పట్టాదారు పాసు పుస్తకాల జారీకి అధికారులు రూ.లక్ష వరకు లంచం డిమాండ్




చేస్తున్నారని రాకోడు గ్రామానికి చెందిన రైతులు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఈ బహిరంగ విచారణ చేసేందుకు మురళి వచ్చారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# కాటన్ మిల్లు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎంపీ గురుమూర్తి



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి కాటన్ మిల్లు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు ఎంపీ గురుమూర్తిని కలిసి తమ సమస్యలను వివరించారు. మిల్లు మూతపడిన తర్వాత తమకు రావాల్సిన జీతాలు, పీఎఫ్, గ్రాట్యూటీ వంటి బకాయిలు ఇంకా చెల్లించకపోవడం వలన తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. 1997 నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటి వరకు గ్రాట్యూటీ చెల్లించలేదని, 110 మంది శాశ్వత ఉద్యోగులకు గత 10 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని ఎంపీకి వివరించారు. అలాగే పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పూర్తి గ్రాట్యూటీ ఇవ్వలేదని, వారికి కేటాయించిన క్వార్టర్లు శిథిలా వస్థలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. గతంలో తమ పక్షాన నిలబడి ఈ సమస్యలను పార్లమెంట్‌లో పలుమార్లు ప్రస్తావించి, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినందుకు ఎంపీ గురుమూర్తికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అప్పటి కేంద్ర జౌళి శాఖా మంత్రి పీయూష్ గోయ ల్‌ను కలిసి ప్రత్యేకంగా కోరిన విషయాన్ని గుర్తు చేశారు. మిల్లు పునరుద్ధరణ కంటే ముందుగా పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలు, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరగా, ఆ సమయంలో ప్రభుత్వం మొత్తం బకాయిలను చెల్లించి సానుకూలంగా స్పందిం చినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు ఇంకా పూర్తిగా పరిష్కరించబడకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను మరోసారి పార్లమెంట్ వేదికగా బలంగా వినిపించి, ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి వారికి హామీ ఇచ్చారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనంతో చేసుకున్న తాహసిల్దార్



**పెళ్లకూరు, (రాజధాని వార్తలు):** పెళ్లకూరు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభు త్వం ఏర్పడ్డాక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు పేద ప్రజలు ఇల్లు కట్టుకునేందుకు 15 కిలోమీటర్లు లోపు ఉన్న వాగులు వంకలు నుండి ఇసుక తరలించుకోవచ్చని ఇసుక పాలసీ విధానాన్ని ప్రవేశపెట్టారు.అదే చదునుతో రావులపాడు గ్రామానికి చెందిన కూటమి కార్యకర్త అండదండలతో ఇసుకాసురులు పెళ్లకూరు మండలంలోని రావులపాడు గ్రామ స్వర్ణముఖి నది నుండి రాత్రింబగళ్లు ట్రాక్టర్లు ద్వారా అక్రమంగా ఇసుకను శ్రీకాళహస్తి ప్రదేశాలకు తరలిస్తుండగా మండల అధికారులు చోద్యం చూస్తుండడంతో రావులపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పెంచలమ్మ ఆధ్వర్యంలో రావులపాడు గ్రామస్తులు మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్వర్ణముఖి నది ఒడ్డున అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తాహసిల్దార్ హరికృష్ణ సంఘటన స్థలాన్ని చేరుకోగా ఆ గ్రామానికి చెందిన కూటమి కార్యకర్త మాకు సీసీ రోడ్లకు వర్క ఆర్డర్ ఉంది మేము సిసి రోడ్లకు ఇసుక తోలుకుంటున్నాం అని వాగ్దానానికి దిగారు. ఆ గ్రామానికి సిసి రోడ్ 30 మీటర్లు పొడవుతో 27. 9.2025 తేదీన వర్క ఆర్డర్ పొంది ఉన్న వర్క్ ఆర్డర్ ను చూపించారు. 30 మీటర్లు రోడ్డుకు గత సంవత్సరం రోజుల నుండి రాత్రింబగళ్లు ఐదు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుంటే ఈరోజు గ్రామస్తులు ఆపితే పాత వర్క్ ఆర్డర్‌ను చూపించి దొంగ నాటకాలు ఆడుతున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించమని రెవెన్యూ ఇన్స్పెక్టర్ కి.వి ఆర్ ఓకి తాహసిల్దార్ తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల ఓనర్లు పై ట్రాక్టర్లు పై కేసులు నమోదు చేస్తామని తాహసిల్దార్ తెలిపారు.

# రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత : ఎమ్మెల్యే చినరాజప్ప



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం సాయంత్రం సామర్లకోట నీలమ్మ చెరువు వద్ద రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు. రైతన్నను రాజును చేసేందుకు నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభు త్వం నుంచి మద్దతు అనే 5 అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రైతుల ఇళ్లకు వెళ్లి పంచసూత్రాలు కరపత్రాలను అందజేసి ఎమ్మెల్యే చినరాజప్ప వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, గోలి వెంకట అప్పారావు చౌదరి (దొరబాబు), సామర్లకోట వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అందుగుల మణి కుమారి, రైతు సంఘం నాయకులు కంటే జగదీష్ మోహన్ బాబు, సొసైటీ అధ్యక్షుడు పైన్నీ శ్రీనివాసరావు కూటమి నాయకులు బదుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, అందుగుల జార్జి చక్రవర్తి, పిట్టా జానకి రామారావు,నూనె రామారావు, బలుసు వాసు, మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# జింగిలిపాలెం దళితులకు భూములు పంచాలి : సీపీఎం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని జింగిలిపాలెం దళితులకు భూములు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో దళితులతో కలిసి ప్రభుత్వ భూమిలో ఎర్ర జెండాలు నాటారు. నారాయణపురం రెవెన్యూ, సర్వే నంబర్ 465లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని గత పదిహేనేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్నారని పుల్లయ్య తెలిపారు. అయితే సాగు పట్టాలివ్వడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉంటే దళితులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు కొందరు స్థానికేతరులకు పట్టాలిచ్చినట్లుగా తెలిసిందన్నారు. రెవెన్యూ అధికారులకు స్థానికేతరులపై ఉన్న ప్రేమ సాగుదారులపై ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు. స్థానికేతరులకు ఇచ్చిన పట్టాలను తక్షణమే రద్దు చేసి స్థానిక దళితులకు భూమి పంచకుంటే భూపోరాటం తప్పదని హెచ్చరించారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, స్థానికులు ఈశ్వర్, మోహన్ కృష్ణ, శంకరయ్య, హరీష్, వెంకట్రామయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan